Pubilshed from Kakinada

PRGI NO : APTEL/25/A1470

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కాకినాడ KAKINADA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 262 Issue No : 262 | బుధవారం Wednesday | ఆగస్టు 19, 2026 19 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



సిఎంఆర్ఎల్ కేసులో

కేరళంలో కొనసాగుతున్న

## ఈడి సోదాలు

కొచ్చి : కేరళంలోని కోజికోడ్‌లో ఎనిమిది ప్రాంతాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి విజయన్ కుమార్తెకు చెందిన, ప్రస్తుతం మూతపడిన సంస్థ ఎక్సలాజిక్ సొల్యూషన్స్, 'కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్)' మధ్య ఆరోపించబడుతున్న అక్రమ చెల్లింపుల వ్యవహారంపై విచారణలో భాగంగా ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు ఈడి అధికారులు బుధవారం తెలిపారు. ఈ ఏడాది మే 27న నిర్వహించిన సోదాలకు కొనసాగింపుగా ఈ దాడులు కొనసాగుతున్నాయి. ఆ సోదాల సమయంలో గుర్తించిన 242 ఖాతాల్లోని 18.36కోట్ల మొత్తాన్ని ఈడి గతంలో స్తంభింపచేసిన సంగతి తెలిసిందే.





జోగి ఆ యనొక కలియుగ

# యోగి...

» ఆనాటి యోగి అంటే నిగ్రహం ... » ఈ జోగి యోగికి అనుగ్రహమే లేకపోయే... » అనవసరంగా ఆడపిల్ల జీవితం పోయే... » అయోగ్యుడని తెలిసికూడా అన్యాయం కు పాల్పడడం అపచారం కాదా... » ఆస్తులు కోసం అమ్మాయిల జీవితాలను బుగ్గిపాలు చేస్తారా... » వర్షించని మేఘం తో మేఘన కు కట్టబెట్టి... » మేఘా మోసం చేశారుగా జోగి కుటుంబం » ఏడాది నిరీక్షణ తర్వాత నిరాశతో ఉన్నా... » నమ్మలేని నిజాలు నయా ప్రపంచం కు తెలుస్తుంటే... » నాయాకత్వమన్న దానికి వీరు అర్హులవుతారా... » ఇన్ని పనికిమాలిన పనులు చేస్తూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతారా... » రాజకీయాల కోసం ఇంత దిగజారి పోతారా... » స్వార్థం కోసం సగటు మనిషి మనస్సుకు మచ్చ తెస్తారా... » ఓ జోగి ఇదేమి నీ జాగీరు అనుకున్నావా... » విధి రాతను తప్పింప తరమా...! » తాళిని కూడా ఎగతాళి చేస్తారా...

"అక్కరకు రాని చుట్టము,మ్రొక్కిన వరమీని వేల్పు, మోహరమున దా-నెక్కిన బారని గుర్రము,గ్రక్కున విడువంగ వలయు గదరా సుమతీ"

(రామమోహన్ రెడ్డి) : ఆపద సమయంలో లేదా అవసరానికి ఏమాత్రం ఆదుకోని బంధువును,మొక్కమొక్కి ప్రార్థించినప్పటికీ మన కోరికలను తీర్చని దేవుడిని, యుద్ధరంగంలోకి వెళ్ళిన తర్వాత ముందుకు పరుగు తీయని పిరికి గుర్రాన్నిక్షణం కూడా ఆలోచించకుండా వెంటనే వదిలివేయాలని సుమతీ శతకం లో చెప్పబడిన విదంగా ఇప్పుడు జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ వ్యవహారం లో జోగి మేఘన పరిస్థితి దాపురించిందని చెప్పక తప్పదు.

పెళ్లి అనగా ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే పవిత్రమైన సామాజిక, చట్టబద్ధమైన బంధం. ఇది కుటుంబం మరియు సమాజ నిర్మాణానికి మూలం. తెలుగు సంప్రదాయంలో నిశ్చయ తాంబూలం, పెళ్లి పందిరి, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ మరియు సప్తపది వంటి అనేక ముఖ్యమైన ఆచారాలతో వివాహం ఘనంగా జరుగుతుంది. భార్యాభర్తల బంధం పరస్పర విశ్వాసం, గౌరవం, ప్రేమ మరియు నిజాయితీలతో కూడి ఉండాలి. ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, కష్టసుఖాలలో తోడుగా ఉండటమే విజయవంతమైన కాపురానికి మూలం. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే ప్రేమానురాగాలు, నమ్మకం మరియు బాధ్యతలను బంధం అంటారు. ప్రేమ అనేది ఇతరుల పట్ల లోతైన ఆప్యాయత, అనురాగం మరియు బలమైన సానుకూల భావోద్వేగ స్థితి. ఇది ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా నిస్వార్థంగా ఎదుటివారి సంతోషాన్ని, శ్రేయస్సును కోరుకునే అత్యున్నతమైన మానసిక భావన. ఇక్కడ మనము చర్చించుకుంటున్న వ్యక్తి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గొప్ప పేరు ప్రఖ్యాతలు గడించిన వ్యక్తి తాలూకు కుటుంబం.

2 లో



ఆప్ ఎమ్మెల్యే అక్రమనిర్బంధంపై

పిటిషన్ విచారణకు అంగీకరించిన

## ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఆప్ ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు అక్రమంగా నిర్బంధించడంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణకు ఢిల్లీ హైకోర్టు మంగళవారం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలన్న సీనియర్ న్యాయవాది షాదన్ ఫర్సాత్ అభ్యర్థన మేరకు చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ నేడు విచారణకు అంగీకరించారు.మంగళవారం తెల్లవారుజామున మఫ్టీలో వచ్చిన సుమారు 20మందికి పైగా పోలీసులు కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారని ఆప్ ఢిల్లీ యూనిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు.

⏭ వివరాలు 2లో..

# జయహో బీసీ..

**బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం**

» గ్రామీణ స్థానిక సంస్థల్లో 34, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు » నిబంధనలకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం » బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం » 28 జిల్లాలకూ జెడ్పీలు ఏర్పాటు-మేయర్, ఛైర్మన్లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు » పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా బీసీలకు వెన్నుదన్నుగా.. » బీసీల్లో లెజండరీ నాయకత్వాన్ని అందించింది టీడీపీనే » స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు ఘనత మాదే » గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ నాయకత్వానికి తీరని ద్రోహం చేసింది » బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని హర్షాతిరేకాల మధ్య సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: జయహో బీసీ... అంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దద్దరిల్లింది. సభ్యుల హర్షాతిరేకాల మధ్య స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి...బీసీ సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశారు.

⏭ వివరాలు 2లో..



పెట్టుబడుల్లో ఏపీ దూకుడు..

# దేశంలోనే 2వ స్థానం

» చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్
» నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
» కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
» సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
» స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలమని వెల్లడి
» ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్





నష్టాల్లో దేశీయ స్టాక్

## మార్కెట్లు ..!

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో సూచీలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. మార్కెట్ ప్రారంభ సమయానికి సెన్సెక్స్ 249 పాయింట్లు (0.32 శాతం) నష్టపోయి 77,479.16 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 50.70 పాయింట్లు (0.21 శాతం) క్షీణించి 24,236.95 వద్ద కొనసాగుతోంది. మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి రెండు సూచీలు నష్టాల్లోనే ఉన్నాయి. మరోవైపు మార్కెట్ ఒత్తిడిలో ఉన్నప్పటికీ కొన్ని కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది. వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్, ట్యూబ్

- మిగతా 2లో..

సభలో అల్లరి చేసి వెళ్లిపోవడమే

# వైసీపీ పని..

**డీఎస్సీ అంటే టీడీపీ: పయ్యావుల కేశవ్**

» మండలి సమావేశాల్లో డీఎస్సీ అంశంపై పట్టుబట్టిన వైసీపీ సభ్యులు » ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి ఆందోళన » ఛైర్మన్‌ను అగౌరవపరిచేలా వైసీపీ సభ్యులు ప్రవర్తిస్తున్నారన్న కేశవ్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సమావేశాలు వరుసగా రెండో రోజు కూడా డీఎస్సీ వివాదంతో వాడీవేడిగా సాగాయి. డీఎస్సీకి వ్యతిరేకంగా వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

- మిగతా 2లో..





పేపర్ లీక్ పిటిషన్‌పై

కేంద్రప్రభుత్వ స్పందన కోరిన

## సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుల్లో ప్రత్యేక, కాలవ్యవధితో కూడిన దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. న్యాయ వాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్.నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.

2 పేజీలో..

ఎన్టీఆర్ పార్టీ

పెట్టాకనే బిసిలకు

# పెద్దపీట



» అసెంబ్లీలో అప్పడే వారికి అగ్రపీఠం » అసెంబ్లీ చర్చలో మంత్రి అచ్చన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : బీసీలకు తెలుగుదేశం పార్టీ హయాంలోనే న్యాయం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బీసీ సాధికారత రిజర్వేషన్లపై మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ పెట్టాక బలహీనవర్గాలను అసెంబ్లీకి పంపారని.. స్థానిక సంస్థలలో 20 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని తెలిపారు. 1995లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 34 శాతం రిజర్వేషన్లను కల్పించారని గుర్తుచేశారు. గతంలో ఉన్న చట్టంలో మార్పు చేయాలంటే .. సవరణ చేయాలన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక బలహీనవర్గాలపై దాడులు చేశారని, దమనకాండ చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుంచి టీడీపీకి అండగా ఉన్న వర్గం బీసీలు అని అన్నారు. అందుకే బీసీలపై వైసీపీ కక్ష కట్టిందని విమర్శించారు.

2 పేజీలో..

# జోగి ఆయనొక కలియుగ యోగి...

మొదటి పేజీ తరువాయి

సుదీర్ఘ రాజకీయ అనుభవం రెండు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి గత వైసీపీ ప్రభుత్వం లో మంత్రిగా ఈ రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించిన వైసిపి నేత మాజీ మంత్రి జోగి రమేష్. ప్రస్తుతం సామాజిక మాధ్యమాలతో పాటు ప్రధాన మీడియా లో కోడై కూస్తున్న అంశం చూస్తుంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించు కునేల ఉందని చెప్పాలి.మొన్నటి వరకు ప్రతి కుటుంబం లో మాదిరిగానే భార్య భర్తల మధ్య మనస్పర్థలు కారణంగా దీనికి తోడు రాజకీయ పరమైన కారణంగా ఇలాంటి వివాదాలు తలెత్తి ఉండొచ్చన్న భావన కొంత మేర ఉండేది.కారణం వైసీపీ ప్రభుత్వం లో దూకుడుగా ఉంటూ నాటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ఇంటిమీద మీదకు కూడా ఒంటి కాలి మీద వెళ్ళి రచ్చ చేసి రాజకీయ

వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన వ్యక్తి జోగి రమేష్.ఆ తర్వాత అధికారం కోల్పోయి అనేక కేసులలో జైలుకు వెళ్లి రావడం జరిగింది.ఇదంతా రాజకీయ పరమైన అంశాలు గా పరిగణలోకి తీసుకునేవి.కానీ నేడునా కుటుంబం గురించి అన్ని రకాల మాధ్యమాల్లో ప్రసారం అవుతున్న విషయాలు చూస్తే అయ్యో వీరు ప్రజాప్రతినిధులేనా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఐదు కోట్ల మంది ప్రజల ప్రతినిధిగా పనిచేసిన ఒక ప్రజాప్రతినిధి ఒక ఆడపడుచు జీవితంలో నిప్పులు పోసారన్న విషయాలు బహిర్గతం అవుతుంటే ఇంతకంటే దుర్మార్గపు పనులు ఇంకేమి ఉంటాయా అన్న ఆలోచన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న సామాజిక అంశాల ఆధారంగా మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ కు ఏడాది క్రితం తెలంగాణ రాష్ట్రంకు చెందిన మేఘన అనే అమ్మాయితో వివాహం చేశారు.అయితే ఈ వివాహం మొదట్లోనే జోగి రాజీవ్ విముఖత వ్యక్తం చేయగా కుటుంబ సభ్యుల ప్రేరణ మేరకు తాళి కట్టి నట్లు నేడు ఆ తాళి ఎగతాళి అయ్యాక ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

దీనితో పాటు జోగి రాజీవ్ తన సహజత్వం గురించి పూర్తిగా బైటికి తెలియజేసినవి వీడియోల రూపంలో వెల్లడి కావడం చూస్తుంటే ఒక ప్రజాప్రతినిధి గా ఉన్న వ్యక్తి సగటు ఆడపిల్ల జీవితం తో ఇలా చెలగాటం ఆడటం ఎంత వరకు సమంజసం అన్న భావన వ్యక్తం అవుతోంది.జోగి ఒక యోగి కాదు కలియుగ యోగి అని యోగి అంటే నిగ్రహం ఉంటుందని కానీ ఇక్కడ అనుగ్రహమే లేదన్న విషయాలు తెలుసుకుని మేఘం వర్షించలేదని మేఘన పడ్డ మనోవేదన చాలా బాధాకరమనే చెప్పాలి.అయోగ్యుడని తెలిసికూడా ఆస్తుల కోసం ఆడపిల్లల జీవితాలను అభాసుపాలు చేసే ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని కోరుకుంటున్నప్పటికీ చివరికి ఈ కేసులు ఎంత వరకు నిలబడతాయన్నది అర్థం కాని ప్రశ్న.మనిషి తన స్వార్థం కోసం విధిరాతని కూడా ఏమార్చి తమ పలుకుబడి తో ఏలుబడి సాగిద్దామని అనుకోవడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్న ప్రజానీకం నుండి ఉత్పన్నమవుతోంది.ఇలాంటి మనస్తత్వం కలిగిన వారు ప్రజల మనస్సులో ఎలా చోటు సంపాదించుకుంటారని ప్రజల్లో చర్చ నడుస్తోంది.మరి ఈ మొత్తం వ్యవహారం లో ఏది నిజం ఏది అబద్ధం అన్నది కాలమే సమాధానం చెప్పాలి.

## సంపాదకీయం

### ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్‌ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷-రోత్సహిస్తోందని అంటున్నారు.

ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే

ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు.

పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు

ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళు తున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్వాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# జయహో బీసీ..

పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సీఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా.. అన్ని పరిమితులలకు లోబడి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్‌లను బీసీ వర్గాలకు వర్తింప చేయనున్నట్టు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34 శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు ముఖ్యమంత్రి సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పని చేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల, దేవేందర్ గౌడ్, అయ్యన్న పాత్రుడు వంటి లెజండరీ నాయకత్వం బీసీ వర్గాల నుంచి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌లను 24 శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బీసీ నేతలకు రాజకీయాల్లో అవకాశాలు దక్కలేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌లను వర్తింప చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34 శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థిరమైన పాలన కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు**..ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని సీఎం వెల్లడించారు. ఈ మేరకు కెబినెట్లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతో పాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని, సరైన అభ్యర్థుల ఎంపిక ద్వారా భావి నాయకత్వాన్ని అందించాలని కూటమి నేతలను కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బీసీలే వెన్నెముక**...ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసాయాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బీసీ సమాజమేనని సీఎం కొనియాడారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బీసీల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తామన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని, ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణాలు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎంపీటీసీ నుంచి ఎంపీగా అవకాశం**...1984లో ఎన్టీఆర్ స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5' కింద బీసీలకు 34 శాతం మేర రిజర్వేషన్లు పెంచామన్నారు అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదుగుతారని, కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీటీసీ బస్తిపాటి నాగరాజును ఎంపీగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే**...శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసీపీ కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసీపీ నేతలు హాజరవుతారని భావించానని, కానీ రాకపోవడం దారుణమని సీఎం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకుల పై కేసులు 20 ఏళ్లుగా కింది కోర్టుకు, పైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2019లో గత పాలకులు బీసీ రిజర్వేషన్ల విషయంలో 176 జీవో తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీం కోర్టుకు కూడా అప్పీలు చేయకుండా వదిలేశారని సీఎం విమర్శించారు. 559, 560 జీవోల ద్వారా రిజర్వేషన్‌లను 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గించి, 16,800 మంది బీసీ నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బీసీలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్ వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బీసీలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని సీఎం తెలిపారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బీసీ నేతలపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టీడీపీకి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తుచేశారు. చివరికి బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో కృతజ్ఞతలు తెలిపారు.

# సభలో అల్లరి చేసి వెళ్లిపోవడమే వైసీపీ పని..



ఈ క్రమంలో, వైసీపీ సభ్యులపై రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా సభలో అల్లరి చేసి వెళ్లిపోవడమే వైసీపీ సభ్యుల ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోందని విమర్శించారు.

ఈరోజు రెండో రోజున మండలి ఛైర్మన్ మోషేన్ రాజు అధ్యక్షతన కార్యకలాపాలు ప్రారంభం కాగానే, డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. ఛైర్మన్ ఆ తీర్మానాన్ని తిరస్కరించి ప్రశ్నోత్తరాలను ప్రారంభించడంతో, వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్యలోనే ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు మాట్లాడే అవకాశం ఇవ్వగా... డీఎస్సీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని ఆయన ప్రశ్నించారు. వేరే ఫార్మాట్‌లో ప్రతిపాదన తీసుకురావాలని ఛైర్మన్ సూచించినప్పటికీ విపక్షం వినకపోవడంతో మంత్రి పయ్యావుల కేశవ్ ఘాటుగా స్పందించారు. ఛైర్మన్‌ను అగౌరవపరిచేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించడం తగదని కేశవ్ మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌నినో సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మొదట చర్చించి, ఆ తర్వాత డీఎస్సీ అంశంపై మాట్లాడదామని తెలిపారు. "డీఎస్సీ అంటేనే తెలుగుదేశం పార్టీ. తమ పాలనలో 14 సార్లు డీఎస్సీ ఇచ్చాం. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని బొత్స సత్యనారాయణ.. ఇప్పుడు నిరుద్యోగులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేశారు. మరోవైపు, శాసనసభలో చర్చించినట్లే మండలిలో కూడా మెగా డీఎస్సీపై సమయం కేటాయించి చర్చించాలని బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏ ఏ అంశాలపై చర్చించాలో బీఏసీ (దీూజ) సమావేశంలో నిర్ణయిస్తామని ఛైర్మన్ స్పష్టం చేసినప్పటికీ, వైసీపీ సభ్యుల నినాదాలు కొనసాగడంతో సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

# కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

- ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు
- ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం
- ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జన్నార్

హైదరాబాద్, హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను



ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## ఆప్ ఎమ్మెల్యే అక్రమనిర్బంధంపై పిటిషన్ విచారణకు అంగీకరించిన ఢిల్లీ హైకోర్టు




పారిశుధ్య కార్మికుడి మృతికి ఢిల్లీ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్యకార్మికులు ఆందోళన చేపట్టారు. వారికి మద్దతుగా నిరసన చేపడుతున్న కుల్దీప్ కుమార్ పోలీసులు అక్రమంగా నిర్బంధించారని అన్నారు. ఆయనను పోలీస్ స్టేషన్‌కి బదులుగా ఆయనను గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకువెళ్లారని అన్నారు. కళ్యాణ్‌పురిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుడిని హత్య చేశారని అన్నారు. గత రెండు రోజులుగా అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది కార్మికులు ఆందోళన చేపడుతున్నారని చెప్పారు.

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం



పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఎన్టీఆర్ పార్టీ పెట్టాకనే బిసిలకు పెద్దపీట

బలహీన వర్గాలకు అండగా ఉంటామని చెప్పి రిజర్వేషన్లను పెంచారని, అయితే చట్టాన్ని మార్పు చేయాల్సి ఉండగా అలా చేయకుండా కొత్త జీవో ఇచ్చారని గత ప్రభుత్వంపై మంత్రి మండిపడ్డారు. ఆ రిజర్వేషన్లు వద్దు అని చెప్పి వైసీపీ సానుభూతిపరుడితోనే కోర్టులో కేసులు పెట్టించారన్నారు. కోర్టులో ఎదురుదెబ్బ తగిలితే సుప్రీంకోర్టుకు వెళ్లలేదని... తద్వారా బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. నేడు కేబినెట్ సమావేశాన్ని ప్రత్యేకంగా పెట్టి స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ల కల్పనపై చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీనవర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు ..!



ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ షేర్లు టాప్ గెయినర్స్‌గా కొనసాగుతున్నాయి. ఇక కోల్గేట్-పామోలివ్ (ఇండియా) లిమిటెడ్, లోధా డెవలపర్స్ లిమిటెడ్, బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ లిమిటెడ్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతు న్నాయి. పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తుండటంతో మార్కెట్ సూచీలపై ఒత్తిడి కొనసాగుతోంది.

## పేపర్ లీక్ పిటిషన్‌పై కేంద్రప్రభుత్వ స్పందన కోరిన సుప్రీంకోర్టు

**పేపర్ లీకేజీలకు పాల్పడిన నిందితులు, వారి కుటుంబసభ్యుల ఆస్తిని స్వాధీనం చేసుకునే విధంగా ఆదేశాలివ్వాలని పిటిషన్ కోరింది. అవినీతి నిరోధక చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం, బినామీ, బ్లాక్ మనీ చట్టాలతో పాటు సంబంధిత చట్టాల కింద దర్యాప్తు చేపట్టాలని కోరారు.**



ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

బుధవారం, ఆగష్టు 19, 2026



# సైబర్ మోస గాళ్ళ మాయ లో పడొద్దు

మీరు చేసే ఒక్క క్లిక్
మీ జీవితాన్ని మార్చొచ్చు!



రూరల్ డీ సీ పీ బి. లక్ష్మీనారాయణ ఐపీఎస్
మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర

జగ్గయ్యపేటలోని విశ్వభారతి డిగ్రీ కళాశాల, మాండవ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు



జగ్గయ్యపేట, ప్రజాభూమి :
"మీ ఫోన్ మీ చేతిలో ఉంది.. కానీ మీ ఫోన్‌లోని సమాచారం ఎవరి చేతిలో ఉంది?" నేటి డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన ప్రశ్న ఇది.ఒక్క క్లిక్.. ఒక్క ఓటిపి. ఒక్క లింక్ చాలు. ఖాతాలోని డబ్బు మాయమవ్వడానికి కొన్నిసార్లు నిమిషాలు కూడా పట్టడం లేదని పోలీసు అధికారులు హెచ్చరించారు.జగ్గయ్యపేట లోని జే ఆర్ సి విశ్వభారతి డిగ్రీ కళాశాల మరియు మాండవ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్స్‌పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచడంతో పాటు, సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.ఈ కార్యక్రమాలకు ఎన్టీఆర్ జిల్లా రూరల్ డిసిపి బి. లక్ష్మీనారాయణ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల తీరుపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతను సైబర్ నేరగాళ్లు ఏ విధంగా తమకు అనుకూలంగా ఉపయోగించు కుంటున్నారో, ప్రజలను నమ్మించి వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, డబ్బును ఎలా కాజేస్తున్నారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవ సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ అవగాహన కల్పించారు."నమ్మకం కాదు.. నిర్ధారణ ముఖ్యం"ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో అప్రమత్తతే ప్రధాన రక్షణ అని అధికారులు సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులకు ఓటిపిలు చెప్పడం, బ్యాంకు వివరాలు, పిన్ లు, పాస్వర్డ్ లు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వంటి చిన్న తప్పిదాలు పెద్ద నష్టాలకు దారితీస్తాయని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫ్రెండ్స్ రిక్వెస్ట్, మెసేజెస్, లింక్స్, ఆన్లైన్ ఆఫర్స్, ఉద్యోగ అవకాశాల పేరుతో వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దని సూచించారు."సాంకేతికత మన జీవితాన్ని సులభం చేయాలి.. మన జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టకూడదు" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు.సైబర్ కేటుగాళ్ల మాయలో పడితే ఖాతాలు ఖాళీ మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర సైబర్ నేరగాళ్ల మాయలో పడి తే మన బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్ము క్షణాల్లో మాయం అవుతుందని సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ ఏసిపి చలసాని శ్రీనివాసరావు , జగ్గయ్యపేట సి ఐ పి. వెంకటేశ్వర్లు , పట్టణ ఎస్ఐ జి రాజు పాల్గొని సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులకు కీలక సందేశంసైబర్ నేరాలపై అవగాహన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దాని వెనుక దాగి ఉన్న ప్రమాదాలను కూడా గుర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా జే ఆర్ సి-విశ్వభారతి డిగ్రీ కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్ , ప్రిన్సిపాల్ కే ఎన్. రమేష్ , వైస్ ప్రిన్సిపాల్, డైరెక్టర్లు జె. తిరుపతిరావు, బి వి ఎల్ నారాయణ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మాండవ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థులకు పుస్తకాల్లోని విద్యతో పాటు, జీవితంలో ఎదురయ్యే వాస్తవ సవాళ్లపై అవగాహన కల్పించడంలో భాగంగా ఇలాంటి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయ మని పలువురు పేర్కొన్నారు.చివరగా ఒక హెచ్చరిక.. ఒక బాధ్యతఓటిపి మీది.. పిన్ మీది. పాస్వర్డ్ మీది..అవి ఎవరికీ చెప్పకపోవడం మీ భద్రతకు మొదటి అడుగు."డిజిటల్ ప్రపంచంలో వేగం ఎంత పెరిగిందో.. సైబర్ నేరగాళ్ల మోసాలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. అందుకే అప్రమత్తతే ఆయుధం.. అవగాహనే రక్షణ.. బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగమే భద్రతకు మార్గం అని సదస్సుల ద్వారా విద్యార్థులకు బలమైన సందేశాన్ని అందించారు.




## శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానానికి వెండి పంచపాత్ర వితరణ

జగ్గయ్యపేట, ప్రజాభూమి:
స్థానిక శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు - శ్రీదేవి దంపతులు స్వామివారి నిత్య కైంకర్యాల నిమిత్తం 193 గ్రాముల వెండి పంచపాత్రను దేవాలయానికి వితరణగా సమర్పించారు. ఈ వెండి పంచపాత్రను దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచా ర్యుల వారికి దంపతులు సభక్తికంగా అందజేశారు. వితరణ సమర్పించిన అనంతరం, అర్చకులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు - శ్రీదేవి దంపతులకు స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.కాగా ఈ కార్యక్రమంలో అల్లి రవిచంద్ర , రాయపూడి వెంకటేశ్వర రావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## మునేరు డ్యాం ఆధునికరణ కు నిధులు అందించండి

### శాసనసభలో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

జగ్గయ్యపేట, ప్రజాభూమి



వేలాది ఎకరాలకు సాగునీరు అందితే 26 గ్రామాల రైతులకు మేలు జరిగేలా మున్నేరు డాం ఆధునీకర ణకు నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ప్రభు త్వాన్ని కోరారు.మంగళవారం శాసనసభ లో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం పరిధిలోని పోలంపల్లి ప్రాజెక్టు గత ప్రభుత్వ కాలం లో చేసిన తప్పిదాల వలన సరైన డిజైన్ లేకుండా నిర్మించబడిందని, దాని ఫలితంగా ఆ ప్రాజెక్టు కింద ఉన్న 26 గ్రామాల రైతులకు సాగునీరు సక్రమంగా అందక ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు పడు తున్న ఈ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని ఆ ప్రాజెక్టు డిజైన్‌ను సమూ లంగా మార్పు చేసి, సంబంధిత అన్ని శాఖల ద్వారా అవసరమైన సాంకేతిక అనుమతులను పొందడం జరిగిందని, ప్రస్తుతం నిధులు విడుదల చేయడం ఒక్కటే మిగిలి ఉందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వివరించారు. ఇటీవల ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ద్వారా ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబా బునాయుడు జిల్లాలోని అందరి శాసన సభ్యులతో సమావేశమై, ఆయా నియోజకవర్గాల్లోని ఫైనాన్స్, నాన్-ఫైనాన్స్ సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను గుర్తిం చాలని కోరిన సందర్భంగా, పోలంపల్లి ప్రాజెక్టు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులకు అత్యంత కీలకమైనదని, దీనికి తక్షణమే నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని శాసన సభ్యులు స్పష్టం చేశారు.రైతుల దీర్ఘకాలిక సమస్యను దృష్టిలో ఉంచుకుని, పోలంపల్లి ప్రాజెక్టుకు తక్షణమే నిధులు కేటాయించి, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అసెంబ్లీ సభ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని మరోసారి కోరారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి

### -సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటి ప్రచారం

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
గుడూరు మండలం పోసినవారిపాలెం పంచాయతీ పరిధిలోని పొట్టేలుగుంటాయిపేటలో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారంగుడూరు మండలం పోసినవారిపాలెం పంచాయతీ పరిధిలోని పొట్టేలు గుంటాయిపేటలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగేశ్వర రావు , ప్రధాన కార్యదర్శి తోట వేణు ,మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు , పోసినవారిపాలెం ఇన్ చార్జి సిరివెళ్ల శ్రీనివాసరావు , క్లస్టర్ కో-కన్వీనర్ బత్తిన రామకృష్ణ , పెడన నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి బత్తిన హర్ష, పోసినవారిపాలెం పంచాయతీ మాజీ సభ్యులు చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు , టీడీపీ నాయకులు చిట్టిబొమ్మ ప్రసాద్ గారు, 56వ బూత్ కన్వీనర్ చిట్టిబొమ్మ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడంతో పాటు ప్రజల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవడమే ఈ ఇంటింటి ప్రచారం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





## విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలి

### చిలకలపూడి ఎస్సై పద్మ....

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
చదువుకునే ప్రతి విద్యార్థి చట్టం పట్ల అవగాహన పెంచుకోవాలని నేరాలకు దూరంగా ఉండాలని చిలక లపూడిసబ్ ఇన్స్పెక్టర్ పద్మ అన్నారు. మంగళవారం మచిలీపట్నం లేడీ యాంప్తుల్ ప్రభుత్వ జూని యర్ బాలికల కళాశాలలో కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి కొల్లు శ్రీనివాసరావు 50 వేల రూపా యలు ఖరీదు చేసి గుర్తింపు కార్డులను విద్యార్థులకు అందజేసే కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిలకలపూడి ఎస్సై పద్మ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా డ్రైవింగ్ చేయరాదని, డ్రగ్స్ కి దూరంగా ఉండాలని ఎటువంటి ఆపద వచ్చినా 112 కు ఫోన్ చేయాలని తెలియ జేశారు. ప్రతి మహిళ తమ ఫోన్ లో శక్తి యాప్ ని ప్లే స్టోర్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని, ఫోన్ చేసిన నిమిషాలలో పోలీస్ టీం వస్తుందని తెలియజేశారు. ఆడపిల్లలు సెల్ ఫోన్ పట్ల తీవ్ర అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో ఇంస్టాగ్రామ్ లో ఫేస్ బుక్ లో పరిచయాలు పెంచుకోవద్దని తెలియజేశారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసమే ఫోక్సో చట్టం తీసుకొచ్చారని జిల్లా జడ్జి స్థాయిలో న్యాయమూర్తి మచిలీపట్నంలో కేసులు విచారణ జరుపు తున్నారని తెలియజేశారు. ఆడపిల్లలను మానసికంగా గాని లైంగికంగా గాని వెకిలి చేష్టల ద్వారా గాని వేధింపులకు గురి చేసే వాళ్ళకి ఫోక్సో చట్టం ద్వారా కఠిన శిక్షలో విధించబడతా యని తెలియజేశారు. పత్తి విద్యార్థి అంకితభావంతో ఇంటర్మీడియట్ స్థాయిలో దిశా నిర్దేశం చదువుకుని ఉన్నతంగా చదువుకుని ఎదగాలని తెలియజేశారు కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం చిన్న గొల్లపాలెంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఐఎఎస్ అధికారి ముత్యాల రాజు నేడు ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నత పదవుల్లో ఉన్న రాజు నేటి యువతరానికి మార్గదర్శకుడు అని తెలియజేశారు. మరో అతిథి ఎం. సి. పి. ఎల్.మేనేజింగ్ డైరెక్టర్ కొల్లు జ్ఞాన సాయి మాట్లాడుతూ మచిలీపట్నం ఎం. సి. పి.ఎల్. సంస్థ ద్వారా గత ఐదు సంవత్సరాలుగా కళాశాలలో ప్రతి ఏడాది గుర్తింపు కార్డులు ఇస్తు న్నామని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాలలో విద్యా ప్రమాణాలు పెరిగాయని కళాశాలలో అడ్మిషన్ సంఖ్య కూడా పెరిగిందని తెలియజేస్తూ పేద విద్యా ర్థులు చదువుకునే తమ కళాశాలలో గతంలో లంకిశెట్టి ట్రెండ్ సర్కిల్ ద్వారా ఉచితంగా ఏక రూప దుస్తులను నేడు గుర్తింపు కార్డులను ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్. అధికారి లంకిశెట్టి హరినాథ్ బాబు, అధ్యాపకులు సురేష్ జయప్రకాష్ ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులందరికీ గుర్తింపు కార్డులు అందజేశారు.

## చదువుపై ఏకాగ్రతతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
'చైతన్యం' కార్యక్రమంలో భాగంగా చల్లపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టం, 112 హెల్ప్‌లైన్, ఈగల్ టీమ్, శక్తి టీమ్స్ సేవలు, మహిళా రక్షణ చట్టాలపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సమగ్ర అవగాహన కల్పించారు.ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రసంగ ముఖ్యాంశాలు:ఉన్నత లక్ష్యాలు – చదువే మార్గం: తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడాలన్నా, భవిష్యత్తులో వారిని బాధ్యతగా చూసుకోవాలన్నా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి.నిరంతర సాధన: ఒకసారి విజయం సాధించామనే సంతృప్తితో ఆగకుండా, అత్యున్నత శిఖరాలను చేరుకోవడానికి నిరంతర సాధన, పట్టుదల కొనసాగించాలి.ఓటమితో నిరాశ వద్దు: పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు. అపజయం జీవితానికి ముగింపు కాదు, విజయానికి దారి చూపించే అనుభవం.సోషల్ మీడియా భద్రత: సామాజిక మాధ్యమాలు వాడే సమయంలో గోప్యత (ప్రైవసీ) పాటించాలి. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.చట్టాలపై అవగాహన – 112 సేవలు: బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు లేదా అసాంఘిక కార్యకలాపాలు దృష్టికి వస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా 112 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి.అనంతరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించి వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్న ఎస్పీ, వారికి విలువైన సూచనలు చేశారు. అనంతరం గురుకుల విద్యాలయ ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పి అభిషేక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్, చల్లపల్లి ఇన్స్పెక్టర్ ఈశ్వర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావు, గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## చెత్త తొలగింపులో నిర్లక్ష్యమా... ఏజన్సీకి ఊచకోత హెచ్చరిక

**గుడివాడ డంపింగ్ యార్డ్ సమస్యపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ నిప్పులు**

**మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమీక్ష**

**రోజువారీ చెత్త తరలింపు నిలిచి పోవడంపై అసంతృప్తి"**

**వెంటనే లెగసీ వేస్ట్ ఖాళీ చేయకపోతే కఠిన చర్యలు తథ్యం**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
గుడివాడ మున్సిపాల్టీలో పేరుకుపోయిన 'లెగసీ వేస్ట్' (పాత చెత్త) తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న ఏజన్సీపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజన్సీ జాప్యం వల్ల పట్టణంలో రోజూ సేకరించే చెత్తను డంపింగ్ యార్డ్‌లో వేయడానికి స్థలం లేక మున్సిపాలిటీకి తీవ్ర సమస్యగా మారింది.ఈ పరిస్థితిపై సమాచారం అందుకున్న చైర్మన్ పట్టాభిరామ్ మంగళవారం నేరుగా గుడివాడ మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వ హించిన అత్యవసర సమావేశంలో క్షేత్రస్థాయి సమస్య లను అడిగి తెలుసుకున్నారు.ప్రజా సమస్యలతో ఆటలొద్దు!పట్టణ ప్రజారోగ్యాన్ని దృష్ట్యా రోజు వారీ చెత్త సేకరణ సజావుగా సాగాలంటే డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఖాళీ చేయాల్సిందేనని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఏజన్సీ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ... యుద్ధప్రాతి పదికన లెగసీ వేస్ట్ తొలగింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పని పూర్తి చేయకపోతే ఏజన్సీపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 19 ఆగస్టు 2026


## చంద్రమౌళేశ్వర,నందీశ్వర స్వామి వారి వార్షిక మహోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

స్థానిక 18వ డివిజన్ గొల్లాయిగూడెంలోని శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి, శ్రీ నందీశ్వర స్వామి వారి ప్రథమ వార్షిక మహోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు హాజరై ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య మేళతాళాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. శ్రీ నందీశ్వర స్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జనసేన నాయకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలి: ఏఐటీయూసీ




ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా "దేశంలో మార్పు రావాలి-మార్పు కోరాలి" నినాదంతో మంగళవారం ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ. అప్పలరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్లను తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, కనీస వేతన బోర్డును పునరుద్ధరించాలని, 12వ పీఆర్సీని ప్రకటించి 30 శాతం ఐఆర్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, ఉప్పులూరి హేమశంకర్ పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు కెమెరాలు తప్పనిసరి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల్లో వీవీల్టీడీతో పాటు డ్యాష్‌బోర్డు కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశించారు. చొదిమెళ్లలోని డీటీసీ కార్యాలయంలో విద్యాసంస్థల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవీల్టీడీ అన్ని విద్యాసంస్థల బస్సుల్లో తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థుల భద్రత దృష్ట్యా డ్యాష్‌బోర్డు కెమెరాలు ఏర్పాటును కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో కెమెరా ఫుటేజీ కీలక సాక్ష్యంగా ఉపయోగ పడుతుందన్నారు. బస్సులకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ తప్పనిసరిగా ఉండాలని, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే లైసెన్స్, యూనిఫాం ఉండాలని తెలిపారు. కనీసం ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్లలోపు వయసు ఉన్న డ్రైవర్లనే నియమించాలని సూచించారు. సమావేశంలో ఎంవీఐలు ఎస్వీ. విఠల్, జి. స్వామి, ఎస్. జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

## ఏలూరు రూరల్ ఎస్సై కి రైల్వే స్టేషన్‌లో ఘనస్వాగతం.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



రష్యాలోని మౌంట్ ఎల్బ్రోస్ శిఖరాన్ని అధిరోహించి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన ఏలూరు రూరల్ ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావుని ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ అభినందించినారు. 2012 వ సంవత్సరంలో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఎంపికైన వేముల వెంకటేశ్వరరావు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, నల్లజర్ల, పాలకోడేరు, భీమవరం వన్ టౌన్, గణపవరం, కలిదిండి పోలీస్ స్టేషన్లలో విధులను నిర్వర్తించి, ప్రస్తుతం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ వై ప్రసాద్ రావు అభినందనలు తెలిపారు. విదేశాల్లో దేశ ఖ్యాతిని, ఏపీ పోలీసు శాఖ గౌరవాన్ని ఇనుమడింపజేసి తిరిగి స్వదేశానికి వచ్చిన ఎస్.ఐ. వేముల వెంకటేశ్వరరావు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీకె. ప్రతాప్ శివ కిషోర్, మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్ఐ వెంకటేశ్వర రావు ను అభినందించారు.

## శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.17.71లక్షలు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



పాలకొల్లు పట్టణములో వేంచేసి ఉన్న శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు మంగళవారం ఆలయ హుండీలు తెరచి లెక్కింపు చేయగా వచ్చిన సొమ్ము రూ.17,71,375/-లు 4 నెలల కాలమునకు వచ్చిన సొమ్ము. భీమవరం డివిజన్ తనిఖీదారు పి. సత్య సాయి కుమారి సమక్షంలో హుండీలు లెక్కింపు జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు, ఆలయ సూపరిం టెండెంట్ వాసు, ఆలయ ధర్మకర్తలు వినికెట్టి శ్రీనివాస్, నాళ ము నాగ వెంకట సురేఖ, కొంద్రెడ్డి సూరిబాబు, వందరపు కుమారి నీలాపు సింహాచలం, స్థానిక ఇండియన్ బ్యాంకు అధికారులు మొదలుగు వారు పాల్గొన్నారు.

- భయాందోళనలో మండల ప్రజలు.
- తెల్లవార్లు గస్తీ కాస్తున్న పలు గ్రామాల యువకులు.

# వేలేరుపాడులో ఏమి జరుగుతుంది?

ప్రజాభూమి ప్రతినిధి- వేలేరుపాడు

పొద్దు పోతందంటే ఏ దొంగలు వస్తారో ఏమి చేస్తారో అన్న భయాందోళనలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన దుస్థితి ని ఎదుర్కొంటున్నారు. ఈ విధంగా మండల కేంద్రమైన వేలేరుపాడుతో సహా రుద్రం కోట, రేపాకగొమ్ము, లచ్చగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు భయంతో అల్లాడిపోతున్నారు. ప్రతి అర్ధరాత్రి టైములో సెంటర్ లేని కార్లు వస్తున్నాయని, వారు మంచి నీరు అడగటం అనుమానాస్పదంగా తిరగటం ప్రజలకు భయాందోళనలను కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో వరుస సంఘటనలు జరగటం ఈ భయాందోళనలకు ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. దీనితో ఈ గ్రామాల్లోని యువకులంతా రాత్రి సమయాల్లో కర్రలతో గస్తీ కాస్తున్నారు. అయినప్పటికీ సోమవారం రాత్రి లచ్చిగూడెం టర్నింగ్ లో కేవలం మహిళలే గల గృహాల వద్ద ఒక కారు, ఒక ఆటో రాత్రి 9:30 సమయంలో ఆగటం అందులోని కొందరు కిందకు దిగి





అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని గమనించిన మహిళలు ఎవరు మీరు ఎందుకు వచ్చారు? ఏమి కావాలి అన్న ప్రశ్నలు వేయటంతో మాది కొత్తగూడెం రేపాకగొమ్ము వెళ్ళాలి అని, ఒకరు చెప్పుతుండగా మరికొందరు తత్తర పడుతూ కారులోకి ఎక్కి వెనక్కు తిప్పుకొని హడావిడిగా వెళ్లిపోవడంతో, కేవలం వీరు దొంగలే దొంగతనానికి వచ్చారని గమనించిన ఆ మహిళలు రుద్రంకోట, వేలేరుపాడు లోని వారికి తెలిసిన కొందరికి ఫోన్లో సమాచారం అందించడం జరిగింది. ఈ విధంగా సమాచారం అందుకున్న యువకులు ద్విచక్ర వాహనాలతో వెంటాడటం ముందుగా ఉన్న వసంతవాడ గ్రామం లోని ప్రజలను ఫోన్లో అప్రమత్తం చేయటంతో, వారు రహదారికి అడ్డంగా ట్రాక్టర్లు ద్విచక్ర వాహనాలను ఉంచటం జరిగిందని, కానా ఈ కార్లు అటుగా వెళ్లకుండా మధ్యలో గుంపెనగుడం మీదుగా అరవ పెల్లి వైపు వెళ్లిపోవడం జరిగిందని, ఇది గమనించి ఇంకా ముందున్న దాసారంలోని యువకులకు సమాచారం అందించగా, వారు గృహాల నుంచి బయటకు వచ్చేసరికి కారు ఆటో వేగంగా వెళ్ళిపోయినట్లు తెలుస్తున్నారు. అసలు వారు ఆయా గ్రామాలకు దొంగతనాల కోసమే వచ్చారని ఇట్టే అర్థమవుతుందని, ఈ గ్రామాలకు చెందిన ప్రజలు స్పష్టం చేయటం జరుగుతుంది. ఈ విధంగా వచ్చేది దొంగలా? స్మగ్లర్లా? ప్రతి రాత్రి వేలేరుపాడు మండలంలోని గోదావరి పరివాహక గ్రామాలకు అనుమానాస్పదంగా వచ్చే పలు వాహనాలు దొంగలవా? స్మగ్లర్లవా? అన్న అనుమానాలు సైతం మరికొందరు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ విధంగా వచ్చే వాహనాలకు స్థానికులే ఎవరో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నది. ఈ విధంగా స్థానికులే ఎప్పటికప్పుడు వారికి సమాచారం అందిస్తుండటం వల్లనే వారు గస్తీకాస్తు వెంబడించే యువకుల చిక్కటం లేదన్నది స్పష్టంగా అర్థమవుతుందని పేర్కొంటున్నారు. బయట వారైతే అడ్డగించిన గ్రామాల్లోకి రాకుండా పక్క దారులకొండ ఎలా వెళ్లగలరు అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులు నిఘా పెట్టి వేలేరుపాడుకు రాత్రి సమయాల్లో వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని, పగటి వేళల్లో సైతం అనుమానాస్పదంగా వచ్చే కొత్తవారిని ఎప్పటికప్పుడు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

### పి. అంకంపాలెం గ్రామంలో ఫోక్ షో చట్టం,

# సైబర్ నేరాలు, హెల్మెట్ భద్రతపై అవగాహన కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి మండలం పి. అంకంపాలెం గ్రామం లో గ్రామ ప్రజలకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు మరియు రోడ్డు భద్రతపై జీలుగుమిల్లి సీ ఐ,ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, చిన్నారులపై లైంగిక నేరాలు అరికట్టేందుకు పోక్సో చట్టంలోని నిబంధనలు, బాలల రక్షణ, బాలల పట్ల తల్లిదండ్రులు మరియు సమాజం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. చిన్నారుల భద్రతకు సంబంధించి ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, యూపీఐ మరియు బ్యాంకింగ్ మోసాలు, ఫేక్ లింకులు, ఫేక్ కాల్స్ తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ , ఏటీఎం /డెబిట్ కార్డు వివరాలు, పిన్ , పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించే ముఖ్యమైన భద్రతా చర్య అని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత తదితరులు పాల్గొని పోలీసు అధికారులు అందించిన సూచనలను పాటిస్తామని తెలిపారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణ మరియు రోడ్డు ప్రమాదాల నియంత్రణే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు చెప్పారు.

## సింగ గూడెం రంగాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం.



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

సింగ గూడెం రంగాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వై సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల ఒరిస్సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పి ఎం ఎఫ్ బి వై ఒక ఎకరాకు 840 రూపాయలు మేము ఆగస్టు 31వ తేదీ లోపల కట్టాలని తెలిపారు వరి పంట సాగు చేయాలని తెలిపారు మండల వ్యవసాయ అధికారి వి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కౌలు వ్యవసాయం చేసే ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా సిసిఆర్సి కార్డు పొందాలని తెలిపారు దీని ద్వారా పంట నమోదు వీలవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సింగగూడెం రంగాపురం రైతు సేవ కేంద్రం ఇంచార్జ్ పి అజయ్ బి ఆదినారాయణ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు

# సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు వహించాలి

### ఎమ్ ఎల్ హెచ్ పి లావణ్య, హెల్త్ అసిస్టెంట్ బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

స్థానిక కొప్పురు గూడెంలో 104 మొబైల్ హెల్త్‌లైన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వర్షాకాలం దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి వలన డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వాటిని నివారించాలని తెలిపారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉన్నచోట దోమలు వ్యాప్తి చెందుతాయి కాబట్టి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డ్రైనేజీల వద్ద ఆయిల్ బాల్స్ వేసి దోమ గుడ్లను నాశనం చేయవచ్చని అన్నారు. రాత్రి సమయాలలో నిద్రించేటప్పుడు దోమతెరలు కట్టుకొని నిద్రించాలని తెలిపారు. ఈ జాగ్రత్తలు తీసుకున్నచో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) ఝాన్సీ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్కీం వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

స్కీం వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, చాలీచాలని వేతనాలతో స్కీం వర్కర్లు అనేక ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అనేక ఏళ్లుగా వారు




పడుతున్న సమస్యలు తెలియజేస్తున్న పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఎన్నికల్లో వచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి చర్యలు చేపట్టాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, మధ్యలో మానుకున్న, విధుల్లో చనిపోయిన వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాడిశ రాము, కారం దారయ్య, కొలూరి సైదా, కారం కుమారి, కరటం సీతామహాలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్యవతి, లీలావతి, రమాదేవి, వెంకమ్మ, కొలూరి నాగమణి, మిరియాల సీత, గుజ్జా శారద, మడివి రాజేశ్వరి, మిరియాల సౌందర్య, ఎన్నె పాషా బహదూర్, రమణయ్య, గాలి ముత్యాలు, పెద్దాపు సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రగడవరం. చింతలపూడి గ్రామాల్లో

# బ్రాందీ షాపులు తనిఖీలు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, ఏలూరు బి. శ్రీలత అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ (ఎన్‌ఫోర్స్‌మెంట్), ఏలూరు కె.వి.ఎన్. ప్రభు కుమార్ మరియు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి, ఏలూరు జిల్లా ఏ. అవులయ్య ఆదేశాల ప్రకారం చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది కలిసి కామవరపుకోట మండలం కొండగూడెం గ్రామంలో ఎక్సైజ్ నేరములు కొరకు దాడులు నిర్వహించగా గుడెల్లి సూరి మందులోడు అను వ్యక్తి వద్ద నుండి (01) లీటరు నాటు సారాయి స్వాధీనం చేసి, ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి కోర్టు ఆదేశాలపై రిమాండ్‌కు తరలించడమైనదిఅలాగే ఈ రోజు





చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో అనధికారముగా మద్యం అమ్ము తున్న తోటా సూరి అను వ్యక్తి వద్ద నుండి (06) డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీన పరచుకొని అతని పై బెల్ట్ కేసు నమోదు చేయడమైనది! అలాగే ఈ రోజు చింతలపూడి మండలం లో గల పలు మద్యం దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరపాలని తగు సూచనలు జారీ చేసినారు ఈ కార్యక్రమాలలో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ. అబ్దుల్ ఖలీల్ , జె.జగ్గారావు మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి.ఐ. శ్రీ.పి. అశోక్ తెలిపారు.

## కలరాయనగూడెం ఎస్సీ కులస్తుల స్మశాన స్థలాన్ని పరిశీలించిన లింగపాలెం తహసీల్దార్ నజీముల్లా షా..



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలోని కలరాయన గూడెం గ్రామంలో స్మశాన స్థలం లేక సుమారు 300 కుటుంబాలు అంతిమ యాత్రకు ఇబ్బంది పడుతున్నామని ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానికులు చేసుకున్న ఫిర్యాదు మేరకు, స్థానిక చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాల మేరకు . లింగపాలెం మండల తహసీల్దార్ మంగళవారం కలరాయన గూడెం గ్రామంలో పర్యటించారు. ఎస్సీ కులస్తుల స్మశాన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే స్మశాన స్థల సమస్యను పరిష్కరిస్తానని మండల తహసీల్దార్ నజీముల్లాషా గ్రామస్తులకు హామీ నిచ్చారు.

# వరి రైతులు.. బీమా మర్చిపోకండి!



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

కొత్త ఈదర గ్రామంలో మండల వ్యవసాయాధికారి జె. భవాని ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ వరి పంట బీమా చేయించుకునే గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఎకరాకు రూ.840 ప్రీమియంతో వరి సాగు చేసిన రైతులందరూ గడువులోగా పంట బీమా చేయించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి రైతు 11 అంకెల రైతు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది ఎంతో అవసరమని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్‌తో రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# డిసెంబర్ కల్లా పోలవరం నిర్వాసితుల కాలనీ పనులు పూర్తిచేయాలి

### అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలను డిసెంబర్ లోగా పూర్తిచేసి, నిర్వాసితులందరినీ కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి మంగళవారం పోలవరం ప్రాజెక్ట్ పునరావాసం, కాలనీల నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ, కాలనీల నిర్మాణపనులపై అధికారులతో జూమ్ కాన్ఫెరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్వాసితులకు పునరావాస కార్యక్రమాల పూర్తిపై ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని, ముఖ్యమంత్రి ఆదేశాల ననుసరించి పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీల నిర్మాణ పనులను డిసెంబర్ లోగా పూర్తిచేసి నిర్వాసితులను సదరు కాలనీలకు డిసెంబర్ లోగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్



అధికారులను ఆదేశించారు. కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులతో పాటు కాలనీలలో రోడ్లు, డ్రైనేజి, అంగన్వాడీ, పాఠశాలలు, త్రాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను నిర్వాసితులను కాలనీలకు తరలించే ముందుగానే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల నిర్మాణానికి, మౌలిక సదుపాయాల ఏర్పాటు నిమిత్తం ఇంకా చేయవలసిన భూసేకరణను వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖ ఎస్ఈ లు జెడ్. రమేష్, విజయరత్నం, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, భూసేకరణ విభాగం అధికారులు, తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.

### అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం..

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు మండలం మండల విద్యాశాఖ. పాలకొల్లుమండల పరిధిలో ఖాళీ ఉన్న మూడు అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ బయాలజీ అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని పాలకొల్లు ఎంఈఓలు గుమ్మల్ల వీరస్వామి. ఆర్ ఎన్ వి.ఎస్ .జి శర్మ ఎంఈఓ తెలిపారు. ఖళీ ఉన్న పాఠశాల వివరాలు. ఎంపీ యూపీ తిల్లపూడి. జడ్పీ హైస్కూల్ శివదేవుని చిక్కాల. ఎంపీ యూపీ గవరపేట . దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ 21 ఆగస్టు 2026 అని తెలిపారు. పై పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దీన్ని ఏదో గడువు లోగా సంబంధిత దరఖాస్తులను పాలకొల్లు మండల విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించవలసిందిగా తెలిపారు.

## పోతనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి

చాట్రాయి మండలంలోని పోలవరం, పోతనపల్లి గ్రామాలలో రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగినది. ఎల్నినో ప్రభావం వలన రైతులు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, మల్చింగ్ విధానం ద్వారా తక్కువ నీటితో సాగు చేయడం, వర్షాభావ పరిస్థితుల్ని అంచనా వేసుకుని ఆరుతడి పంటలు అయిన జొన్న, మినుము, పెసర, వేరుశెనగ , నువ్వులు సాగు చేసుకోవచ్చని, నీటి ఎద్దడి ఉన్న పొలాల వద్ద, తోటలలో అంతర పంటగా నవధాన్యాలు సాగు చేయడం ద్వారా 365 రోజులు భూమిని పంటతో కప్పి ఉంచవచ్చని భూమిలో సేంద్రీయకరమైన పదార్థాన్ని పెంచే విధముగా నేల స్వభావాన్ని మార్చవచ్చని





మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివశంకర్ తెలియపరిచినారు .ఫార్మర్ యాప్ ద్వారా రైతులకు ఈ పంట నమోదు గురించి తెలియజేయడం జరిగినది.ఇన్సూరెన్స్ కట్టుటకు రైతులకు వరి పంటకు చివరి తేదీ ఆగస్టు 31 అని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగినది జరిగినది. రైతులు ప్రధానంగా ఆరుతడి పంటలపై మొగ్గు చూపే దశలో యాజమాన్య పద్ధతులను నీటి వనరులను జాగ్రత్తగా వాడుకునే విధానాన్ని డ్రిప్ ఇరిగేషన్ ఉపయోగాలు, ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు డెమో ద్వారా జీవామృతం తయారు చేసి ప్రకృతి వ్యవసాయం యొక్క ఉపయోగాలను రైతులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి =.హేమ , మండల వ్యవసాయ అధికారి బి శివ శంకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంటు, రైతులు పాల్గొనినారు.

## ప్రజారోగ్యంపై ఆకట్టుకున్న ఎల్ ఆర్. కృష్ణబాబు బృందం కళా ప్రదర్శనలు

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయిగూడెం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రజారోగ్యంపై ఎల్ ఆర్. కృష్ణ బాబు బృందం ప్రదర్శించిన కళా ప్రదర్శన పలువురిని ఆకట్టుకుని, ఆలోచింప చేసాయి. స్థానికఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళ వారం ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డి ఎం హెచ్ ఓ, జిల్లా ఎయిడ్స్. లెప్రసీ, క్షయ నివారణ అధికారి, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ అండ్ హెచ్ఐవి నియంత్రణ అధికారుల సహకారంతో కృష్ణ బాబు బృందం హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తూ కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. కృష్ణ బాబు బృందం ప్రదర్శించిన టీ స్టాల్, కింగ్ లాంటి కుర్రోడు కళారూపాలు



ఆకట్టుకున్నాయి. యువతను పెడదారి పట్టిస్తున్నటువంటి మాదకద్రవ్యాలు గంజాయి, హెరాయిన్ కి బానిస కావద్దని యువతరానికి బంగారు భవిష్యత్తు వివరిస్తూ మనిషి విలువ చాటి చెప్పిన కళాజాత ప్రదర్శన ఆలోచింప జేసింది. రక్తదానం వల్ల మరో ప్రాణాన్ని రక్షించొచ్చని, నిర్భయంగా రక్తదానం ప్రతి ఒక్కరూ చేయొచ్చని అన్నారు. అదేవిధంగా హెచ్ఐవి కి భయపడవలసిన అవసరంలేదని, పరీక్షలు జరిపించుకొని, సక్రమమైన మందులు వాడుతూ, పోషకాహారం తీసుకున్నట్లయితే మనిషి జీవిత కాలం బ్రతకొచ్చని తెలిపారు. అదేవిధంగా హెచ్ఐవి సోకిన వ్యక్తిని చులకనగా చూస్తే 2017 చట్టం ద్వారా జరిమానా, జైలు శిక్ష కూడా పడుతుందని అన్నారు. కళాకారులు జాగ్రత్త జాగ్రత్త తమ్ముడు... జాగ్రత్త జాగ్రత్త అమ్మడు..., హెచ్ఐవి తెచ్చుకోకు - చీకటి తప్పు చేయబోకు, ఇంటికి దీపం ఇల్లాలు ఉండగా అపరిచితులతో పరిచయం వద్దు వంటి పాటలతో ప్రజల్ని ఆలోచింప చేశారు. ఈ కార్యక్రమంలో దిశా ఎన్జీవో సంస్థ పిఎం స్వాతి, ఓ ఆర్ డబ్ల్యు మంగతాయారు, పి ఈ దుర్గ రాణి, తదితరులు పాల్గొన్నారు.

### చింతలపూడి ఆశ్రమం వీధి కొప్పుల వారి వీధిలో సీసీ రోడ్డుకు స్థాపన చేసిన కూటమి నాయకులు.



ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి

చింతలపూడి మండలం చింతలపూడి పట్టణంలోని చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును కూటమి నాయకులు కొత్తపూడి శేషగిరిరావు. కేతేపల్లి చంద్రశేఖర రావు. చింతలపూడి పట్టణం టిడిపి పార్టీ అధ్యక్షులు తాటి అప్పారావు. సుధాని నారాయణరావు ఆధ్వర్యంలో ఆశ్రమం పక్కన కొప్పుల వారి వీధిలో సుమారు 40 లక్షల రూపాయలు సీసీ రోడ్డును శంకుస్థాపన చేసిన కూటమి నాయకులు ఈ సందర్భంగా ఇసుక శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనూ రోడ్లు లేవని ఎమ్మెల్యే రోషన్ కుమార్ని విన్నవించుకోగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ సిసి రోడ్డుకు 40 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది ఈ రోడ్డును మూడు రోజులలో ప్రారంభిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కోటమి నాయకులు హరిబాబు జైపాల్.రాయప్ప. సత్తిబాబు కంభం రమేష్. శ్రీను అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామంలో భరతదేశపు తొలి బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి కార్యక్రమం గౌడ సంఘయులు ఘనంగా నిర్వహించడం జరిగింది, పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం కేక్ కట్ చేసి మిట్టయిలు పంచారు, చాట్రాయి మండలం గౌడ సంఘం అధ్యక్షులు బూబత్తుల చెన్నారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు తల ఎత్తుకునేలా చేసి, బహుళ జనాలకే రాజ్యధికారం అని



నినదించిన బడుగుల పెన్నిధి సర్దార్ పాపన్న గౌడ్ అని అన్నారు, నూజివీడు నియోజకవర్గం అధ్యక్షులు తల్లాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై స్వతంత్ర జ్యోతి వెలిగించిన మహావీరుడు, భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడు అని అన్నారు, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాజారికపు వ్యవస్థ నీడలో జామిందార్లు సాగిస్తున్న అరాచకాలను గ్టరిల్లా సైన్యం తయారు చేసి భువనగిరి, వరంగల్, గోల్కొండ కోటలను జయంచి బహుజన చక్రవర్తి గా ఖ్యాటి ఘంచారు అని అన్నారు, ఈ కార్యక్రమంలో పర్వతాపురం టీడీపి మాజీ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరావు, తుమ్మగూడెం గౌడ సంఘయులు పానుగంటి శ్రీమన్నారాయణ, అనిల్, సత్యనారాయణ, రాము,అప్పారావు, శ్రీనివాసరావు, మిద్దె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు

## పోలింగ్ కేంద్రాలపై ఎంపీడీవో ప్రత్యేక దృష్టి

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి ఎంపీడీవో అబ్దుల్ సలాం మంగళవారం బొద్దనపల్లి, ఈదర, కె.ఈదర, సీతారామపురం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య ఏర్పాట్లను ముందుగానే పరిశీలించి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని సంబంధిత



అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన మరమ్మతులు ఉంటే వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బొద్దనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంపీడీవో, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని, వంటశాల పరిశుభ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. భోజన పదార్థాల నాణ్యత, మెనూ అమలు, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా భోజనం సరిపడేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

### జాతీయ వాగ్దేవి విశిష్ట ప్రతిభ పురస్కారం అవార్డు గ్రహీత కుమార్ కు అభినందనలు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

జక్కంపూడి లక్ష్మీ నరసింహ నాగేంద్ర కుమార్ "సామాజికవేత్త" గా "జాతీయ వాగ్దేవి విశిష్ట ప్రతిభ పురస్కారం" అందుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల పవన్ కుమార్, నల్ల అజయ్ , కాసు తదితర నాయకులు అమలాపురం నుండి వచ్చి అభినందించారు.జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి గర్వకారణం అని కొనియాడారు.

## జైలు రిమాండ్‌లో ఉన్న తమ్మన శ్రీనివాస్‌ను ములాఖత్‌లో కలిసిన చిర్ల జగ్గిరెడ్డి

### తమ్మన శ్రీను కుటుంబ సభ్యులతో కలిసి ములాఖత్‌లో పరామర్శించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 14 రోజుల రిమాండ్‌లో ఉన్న ఆలమూరు మండలానికి చెందిన తమ్మన శ్రీనివాస్ ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ములాఖత్‌లో కలిశారు. ఈ సందర్భంగా తమ్మన శ్రీనివాస్ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ఆయనకు, ఆయన కుటుంబానికి



అండగా ఉంటారని చిర్ల జగ్గిరెడ్డి భరోసా ఇచ్చారు. తమ్మన శ్రీనివాస్ పై నమోదైన కేసులకు సంబంధించి న్యాయపరమైన అంశాలను న్యాయవాదులతో చర్చించి, చట్టపరంగా అన్ని విధాలుగా పోరాటం చేస్తామని చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తమ్మన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కూడా చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా పార్టీ తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

## అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు తుర్లపాటి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి-చింతలపూడి

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దేశవ్యాప్తంగా మార్పు కావాలి మార్పు కోసం అనే నినాదంతో నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ట్రేడ్ యూనియన్ ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సందర్భంగా చింతలపూడి తాసిల్దార్ కార్యాలయం వద్ద ముఠా కార్మికులు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దేశవ్యాప్తంగా మార్పు కావాలి మార్పు కోసం అనే నినాదంతో నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ఆందోళనలో భాగంగా అసండంగి త రంగంలో పనిచేస్తున్న అమాలి ఆటో తదితర రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతనం 26,000 కార్మికులకు ఇవ్వాలని మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ మండల కమిటీ సభ్యులు కంపసాటి రమేష్ కంపసాటి రంగారావు ఎర్ర గొర్ల కృష్ణ కే నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతోనే సమాజంలో మానవత విలువలు పెంపొందుతాయి

-గడ్డమణుగు రవికుమార్



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకుంటే సమాజంలో ప్రశాంతత, సోదరభావం, మానవతా విలువలు మరింత పెంపొందుతాయని జనసేన జిల్లా కార్యదర్శి, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ అన్నారు. ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో స్వాతి నక్షత్రం సందర్భంగా నిర్వహించిన సుదర్శన నృసింహ, ధన్వంతరి, గరుడ, ఆంజనేయ, సుబ్రహ్మణ్య హోమాల్లో రవికుమార్ గీత దంపతులు పాల్గొన్నారు. అనంతరం మూలవిరాట్ స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, పంచహారతులు, నీరాజనం, మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి మాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మహర్దశ పట్టుకుందని అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఘాట్ రహదారి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. భవిష్యత్‌లో ఈ క్షేత్రం మరింత అభివృద్ధి చెంది ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

### వెనుకబడిన తరగతులకు 34% రిజర్వేషన్ ఆర్థిక చరిత్రాత్మక బీసీ సమక తరపున కృతజ్ఞతలు

ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి



సాధనకు నిర్ణయానికి కూటమి ప్రభుత్వం తెచ్చుకున్న చరిత్ర ఆత్మిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,మరియు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్‌కి, డి ప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్కి అలాగే ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి. బీసీలకు 34% రిజర్వేషన్లు పునరుద్ధరించినందుకు చింతలపూడి నియోజకవర్గం ప్రగడవరం గ్రామం బీసీ సమైక్య సభ్యులు తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ చేశారు. బీసీ నాయకులు శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన పాలకమండల సభ్యులు కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం, సామాజిక న్యాయం మరియు రాజకీయ, ఆర్థిక సాధికారత సాధనకు మా కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి బీసీ సమైక్య తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ ఎంపిటిసి కొనకల్ల రాజులి మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో బీసీ సమైక్య నాయకులు లిచక్రపు మారేశ్వరరావు ,రాచకొండ రాంబాబు , జుంజు రామకృష్ణ చిర్రా అప్పారావు. కాగిత రాఘవేంద్ర పాల్గొన్నారు.

### ఘనంగా పాపన్న జయంతి

ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి



చాట్రాయి మండలం తుమ్మగూడెం గ్రామంలో భా రతదేశపు తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి కార్యక్రమం గౌడ సంఘయులు మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది, పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం కేక్ కట్ చేసి మిట్టయిలు పంచారు, చాట్రాయి మండలం గౌడ సంఘం అధ్యక్షులు బూబత్తుల చెన్నారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు తల ఎత్తుకునే లా చేసి, బహుళ జనాలకే రాజ్యధికారం అని నినదించిన బడుగుల పెన్నిధి సర్దార్ పాపన్న గౌడ్ అని అన్నారు, నూజివీడు నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులు తల్లాడ శ్రీనివాసరావు మాట్లా డుతూ తెలంగాణ గడ్డపై స్వతంత్ర జ్యోతి వెలిగించిన మహావీరుడు, భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన యోధుడు అని అన్నారు,గ్ రాష్ట్ర గౌడ సంఘం నాయకులు కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాజారికపు వ్యవస్థ నీడలో జామిం దార్లు సాగిస్తున్న అరాచకాలను గ్టరిల్లా సైన్యం తయారు చేసి భువనగిరి, వరంగల్, గోల్కొండ కోటలను జయంచి బహుజన చక్రవర్తి గా ఖ్యాటి ఘంచారు అని అన్నారు, ఈ కార్యక్రమంలో పర్వతాపురం టీడీపి మాజీ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరావు, తుమ్మగూడెం గౌడ సంఘయులు పానుగంటి శ్రీమన్నారాయణ, అనిల్, సత్యనారాయణ, రాము,అప్పారావు, శ్రీనివాసరావు, మిద్దె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

బుధవారం 19 ఆగస్టు 2026


## రాచేపల్లి పంచాయతీలో సిబ్బంది విధులకు గైర్హాజరు..



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలంలోని రాచేపల్లి గ్రామంలో పంచాయతీలో ఉదయం 11.45 గంటల వరకు పంచాయతీ సిబ్బంది విధులకు హాజరు కాకపోవ డంతో ప్రజలు ఇబ్బందులు, ఎదుర్కొంటున్నారు ఓటరు నమోదు, ఇతర పంచాయతీ సేవల కోసం వచ్చిన రైతులు, గ్రామస్థులు సిబ్బంది కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.సిబ్బంది సమయానికి విధులకు హాజరు కాకపోవడంతో తమ పనులు పూర్తి కాక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా,ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ సిబ్బంది సమయపాలనపై దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఏపీ గ్రీన్ చైర్మన్ నాగబాబుని కలిసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

కళ్యాణదుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు నాగబాబుని మర్యాదపూర్వకంగా మంగళవారం అమరావతిలో కలిశారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ చైర్మన్గా ఎన్నికైన సందర్భంగా నాగబాబుకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం నాగబాబుతో ఆత్మీయంగా సమావేశమై పలు విషయాలపై మర్యాదపూర్వకంగా చర్చించారు. నాగబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, తన సోదరుడు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ గ్రీన్ చైర్మన్గా రాష్ట్ర భవిష్యత్తు కోసం కృషి చేస్తానని మొక్కలు నాటడం తన జీవితంలో భాగమని ఈ పదవిని గొప్ప బాధ్యతగా భావిస్తున్నాననీ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతానని ఆయన ప్రకటించారు.

## రూ.5 లక్షల విలువ చేసే బంగారు నగల రికవరీ

### -బాధితురాలికి అప్పగింత-కానిస్టేబుల్ ను అభినందించిన ఎస్సై



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బంగారు నగలు పోగొట్టుకున్న బాధితురాలికి రోజుల వ్యవధిలో రికవరీ చేసి అందించిన సంఘటన హిందూపురంలో చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం పట్టణంలోని త్యాగరాజు నగర్ లోని నివాసం ఉంటున్న వృద్ధురాలు గత నాలుగు రోజుల క్రితం బంగారు గాజు, ఉంగరాన్ని పోగొట్టుకుంది. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుంది. తన బంగారం పోగొట్టుకుపోయిందని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనిల్ ప్రత్యేక చొరవ చూపి వృద్ధురాలు పోగొట్టుకున్న బంగారాన్ని గుర్తించి రికవరీ చేశారు. దీంతో మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై రాజేష్ సమక్షంలో రికవరీ చేసిన బంగారాన్ని వృద్ధురాలికి అందించారు. బంగారు నగల రికవరీ కోసం కానిస్టేబుల్ అనిల్ చూపిన చొరవను ఎస్సై రాజేష్ అభినందించారు. అలాగే కానిస్టేబుల్ అనిల్ కు వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేసింది.

## ఇసుక డంప్ యార్డ్ లపై దాడులు జరిపిన మైనింగ్ శాఖ అధికారులు

### ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్న మైనింగ్ శాఖ తాసిల్దార్ శేషారెడ్డి సీఐ రామయ్య ఎస్సై కే ప్రసాద్



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామం కొరివిపల్లి గ్రామం నిదనవాడ గ్రామంలో పెన్నా నది పరిసరాల ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులపై పోలీస్, రెవెన్యూ, మైన్స్ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. శింగనమల మండలంలోని ఉల్లికల్లు ఇసుక కాలువ ప్రాంతాన్ని అధికారులు తనిఖీ చేశారు.తనిఖీల్లో పలు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులు గుర్తించడంతో వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఇసుకకు సంబంధించి సీజ్ పంచనామా,నిర్వహించారుఅనంతరం ఇసుక డంపులను రెవెన్యూ, మైన్స్ శాఖల అక్రమ ఇసుక తవ్వకాలు, నిల్వలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారులు సీఐ రామయ్య ఎస్సై కే ప్రసాద్ తాసిల్దార్ శేషారెడ్డి రెవెన్యూ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్

### -భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్ రహదారిలో జన సంచారం అధికంగా ఉండే ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఎలాంటి రక్షణ కవచం లేకుండా ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వ్యాపారులు, స్థానికులు, వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ట్రాన్స్ఫార్మర్కు భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న డీపీ వద్ద తరచూ ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం కూడా ట్రాన్స్ఫార్మర్ వద్ద ఒక్కసారిగా నిప్పు రవ్వలు ఎగిసి, పెద్ద శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగక పోవడం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందుగానే ట్రాన్స్ఫార్మర్ చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేసి, తరచూ తలెత్తుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి దీనిపై స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

# అనంత రైతుల కష్టాలు అనంతం! సాగునీరు అందించాలి, నష్టపరిహారం చెల్లించాలి!

### శ్రీశైలం నుండి దిగువకు వదులుతున్న నీటిని వెంటనే ఆపేయాలి! -జిల్లా రైతుల పరిస్థితులపై అసెంబ్లీ తీర్మానం చేయాలి!

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా పేరు వింటేనే డొక్కల కరువులు, రైతులు, విద్యార్థుల ఆత్మహత్యలు, కూలీల వలసలు, ఆడపిల్లల అమ్మకాలు, పశువులను కళేబరాలకు తరలించే దృశ్యాలే గుర్తుకు వస్తాయి అని అన్నారు. మంగళవారం జిల్లా వైయస్సార్సీపి కార్యాలయంలో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్, వై విశ్వేశ్వర్ రెడ్డి, రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి, కె.వి రమణ మాట్లాడుతూ నేడు మరలా పునరావృతమయ్యే పరిస్థితులు కనబడుతున్నాయి అన్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగిన జిల్లాగా, ఎడారి నివారణ కోసం డి పి ఎ పి, డిడిపి, ఈ జి ఎస్ లాంటి పథకాలు దశాబ్దాల క్రితమే, అమలు జరిగి, బుందేల్ఖండ్ తరహా ప్యాకేజీ కావాలని, పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక హోదా కల్పించాలనే డిమాండ్ ఉన్న ప్రాంతం అన్నారు. ఇక్కడ సాగుకు యోగ్యమైన భూమి సుమారు 33 లక్షల ఎకరాలు ఉన్నది అని, ఇందులో కేవలం 1,03,000 ఎకరాలు, అంటే కేవలం 3.10 శాతం భూమికి మాత్రమే నీటి సౌకర్యం ఉన్న దేశంలోనే ఏకైక దుర్భిక్ష ప్రాంతం అని అన్నారు. ఇలాంటి తరుణంలో గోరుచుట్టుపై రోకటి పోటు లాగా, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు




ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్ తుడిచి పెట్టుకు పోయింది. రైతులు చేసిన సేద్యం, వేసిన విత్తనం, కొన్న ఎరువులు, కట్టిన ఇన్సూరెన్స్ ప్రీమియం, అన్నీ మట్టిపాలైనాయి. కనీసం త్రాగడానికైనా గుక్కెడు మంచినీరు దొరుకుతుందనుకుంటే గత సంవత్సరం హంద్రీ-నీవా ద్వారా ఈ జిల్లా వాటా కు వచ్చిన 30 టీఎంసీలు, హెచ్ఎల్సీ ద్వారా వచ్చిన మరో 25 టిఎంసిలు, మొత్తం 55 టీఎంసీల నీటిని ఎన్ని ఎకరాలకు పారించారో, ఎక్కడికి పోయిందో చెప్పేవారే లేరు. అస్తవ్యస్తమైన నీటి నిర్వహణతో నీటినంత ఏటిపాలుచేశారు. ప్రస్తుతం వర్షాభావం వల్ల కృష్ణ వరద ఆగిపోయి, శ్రీశైలంలో 195 టీఎంసీల వద్ద నిలిచిపోయింది. అయినా 45 వేల క్యూసెక్కులు కిందికి వదులుతున్న ఈ ప్రభుత్వానికి పట్టలేదు. తద్వారా మల్యాల వద్ద హంద్రీ-నీవాకు చేస్తున్న పంపింగ్ కేవలం ఇక పది రోజులు కూడా జరగదనే పరిస్థితి ఉండదు. కావున వెంటనే శ్రీశైలం గేట్లు మూసివేయాలి, తుంగభద్రకు పూర్తిస్థాయి నీటిమట్టం వచ్చే పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ హెచ్ ఎల్ సి కి కేవలం 15 టీఎంసీలు కేటాయించడం, వచ్చే నీరు కూడా హెచ్.ఎల్.సి ఆధునీకరణ చేయకపోవడం వల్ల తెచ్చుకోలేనిపరిస్థితి ఉందన్నారు. కర్ణాటకలో హెచ్ ఎల్ సి కింద మూడు నెలల పాటు ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు అనుమతించినప్పుడు ఇక్కడ మాత్రం త్రాగడానికే అని చెప్పి, హెచ్చరికలు చేసి రైతులను కట్టడి చేయడం దుర్మార్గం, ఈ ప్రభుత్వం చేతగానితనం, జిల్లాలో కనేకల్లు, బొమ్మనహాల్, విడపనకల్లు, గుంతకల్లు, ప్రాంతాల్లో ఉండే భూములకు హెచ్ ఎల్ సి నీరే ఆధారం అని అన్నారు. వీటికి మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ ప్రాంతంలో సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో తరిభూమే 30 వేల ఎకరాలు ఉంది. రైతులు నీరు వస్తుందనే ఆశతో ముందుగానే బోర్ల కింద మిరప, వరి నార్లు పోసుకున్నారు, అది కాస్త ముదిరిపోతున్నది. చివరికి మిర్చి, కంది లాంటి పంటలకు ఆరుతడలు అయినా ఇస్తారని ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఇవ్వలేని పరిస్థితులలో ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం రైతులకు చెల్లించాలి అని అన్నారు. పశువులకు గ్రాసం సరఫరా చేసి కళేబరాలకు పోకుండా నివారిస్తామనే స్పష్టమైన ప్రకటన అయినా చేయాలి. ఇంత దుర్భిక్ష పరిస్థితులు ఉన్నప్పటికినీ కనీసం జిల్లా స్థాయి సాగునీటి సమావేశం జరపకపోవడం ఈ జిల్లా కలెక్టర్, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమిష్టి వైఫల్యమే అని అన్నారు. ఇలాంటి దిక్కుతోచని పరిస్థితులలో రైతులు తిరుగుబాటు చేయక తప్పదు. అందువల్ల వెంటనే హెచ్ ఎల్ సి ఆయకట్టు కింద ఆరుతడి పంటలకు నీళ్లు అయినా ఇవ్వాలి, లేక పూర్తిస్థాయి నష్టపరిహారం అయినా చెల్లించాలి. మొదటి ప్రాధాన్యతగా త్రాగునీటి కోసం హంద్రీ-నీవా నీటితో పీఏబీఆర్ తో పాటు జీడిపల్లి, గొల్లపల్లి, బ్రాహ్మణపల్లి రిజర్వాయర్లను నింపాలి, తద్వారా అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వాలి. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఈ జిల్లా రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధులు గళం విప్పాలి అన్నారు. గతంలో ఈ జిల్లా రైతులకు చెల్లించాల్సిన పంట నష్టపరిహారంతో పాటు, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ ఖరీఫ్ లో జరిగిన నష్టాన్ని భరించడానికి, వలసలను ఆపడానికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని అసెంబ్లీ తీర్మానం చేయాలన్నారు.

# ఇసుకపై అక్రమ రవాణాదారుల కన్ను

### -అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని, దీనివల్ల భవిష్యత్లో భూగర్భ జలాలకు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని చౌళూరు గ్రామ పెద్దలు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే తూమకుంట నుండి హిందూపురం సుగూరు వరకు పెన్నా నది పరిధిలో పెద్దఎత్తున ఇసుకను తరలించడంతో నది గర్భంలో ఇసుక నిల్వలు దాదాపు ఖాళీ అయ్యాయని తెలిపారు. చౌళూరు గ్రామ పరిధిలో మాత్రం గ్రామ పెద్దలు, రైతులు గతంలోనే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపును అడ్డుకోవడంతో ఇప్పటి వరకు ఇసుక కొంతమేర సమృద్ధిగా ఉందన్నారు. అయితే ఇటీవల తూమకుంట తదితర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు చౌళూరు పరిధిలోని పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి పారిశ్రామిక ప్రాంతాలకు, కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇసుక తరలింపు ఇదే విధంగా కొనసాగితే చౌళూరు ప్రాంతంలో కూడా కొద్దికాలానికే ఇసుక నిల్వలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన



వ్యక్తం చేశారు. పెన్నా నదిలో ఇసుక నిల్వలు కేవలం నిర్మాణ అవసరాలకు మాత్రమే కాకుండా భూగర్భ జలాల పరిరక్షణకు కూడా ఎంతో కీలకమని రైతులు తెలిపారు. నదిలో ఇసుక పొరలు నీటిని నిల్వ చేసుకోవడంతోపాటు భూగర్భ జలాలను సమృద్ధిగా ఉంచేందుకు దోహదపడతాయని చెప్పారు. ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తే నది పరివాహక ప్రాంతంలోని భూగర్భ జలాల మట్టం పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల వ్యవసాయ బోర్లు ఎండిపోవడంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తూమకుంట నుండి హిందూపురం సుగూరు వరకు పెన్నా నది పరిధిలో ఇసుక తరలింపు కారణంగా పరిస్థితి ఆందోళనకరంగా మారిందని గ్రామస్థులు పేర్కొన్నారు. చౌళూరులోనూ అదే పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. రాత్రి వేళల్లోనూ ఇసుక తరలింపుపై నిఘా పెట్టాలని, అనుమతులు లేకుండా ఇసుకను తరలించే వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో చౌళూరు గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు మంగళవారం వీఆర్వో ద్వారా హిందూపురం తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. చౌళూరు గ్రామ పరిధిలోని పెన్నా నది ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలని, ఇసుక నిల్వలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇసుకను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థుల ఫిర్యాదుపై అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి -ఎస్డీపీఐ నాయకుల వినతి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు (ఎస్డీపీఐ) డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని నిరసిస్తూ ఎస్డీపీఐ నాయకులు మంగళవారం హిందూపురంలోని అంబేద్కర్ సర్కిల్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్డీపీఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.నూర్ మొహమ్మద్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు.




ముస్లిం మైనార్టీల కోసం హజ్ హౌస్ నిర్మాణం చేపట్టాలని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల హామీలు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా ప్రతి హామీకి స్పష్టమైన కాలపరిమితిని నిర్ణయించి పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఎస్డీపీఐ ఎస్డబ్ల్యూసీ సభ్యులు అబ్దుల్ హసీబ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితం చేయడం సరికాదన్నారు. మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి అందించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ప్రకటించిన సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇమామ్లు, మౌజన్లు, పూజారులకు ప్రకటించిన గౌరవ వేతనాలను అమలు చేయడంతో పాటు ముస్లిం మైనార్టీలకు ప్రకటించిన సంక్షేమ పథకాలను కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హిందూపురం అసెంబ్లీ అధ్యక్షులు ఇమ్రాన్ మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు. ప్రజల హక్కులు, సంక్షేమం కోసం ఎస్డీపీఐ నిరంతరం ప్రజల తరపున పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హసీబ్, నాసిర్ నాదీం, అబ్దుల్ ఆఫర్, రియాజ్, ఇంతియాజ్, అజహార్ తదితర నాయకులు, వార్డు నాయకులు, ఎస్డీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర క్రీడా విభాగం అధ్యక్షులు జీవీ వి ఎస్ కమలాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగినది.డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ క్రీడలపట్ల విద్యార్థులను చైతన్యం చేసి క్రీడల వల్ల దేశం ముందడుగు వేస్తుందని, భావిభారత భవిష్యత్ పౌరులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర క్రీడా విభాగ అధ్యక్షులు జి వివిఎస్ కమలాకర్ మాట్లాడుతూ నేడు దేశం లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదని ప్రతి దాంట్లో వెనుకబాటుతనం చోటు చేసుకుందని,క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువస్తే వారికి న్యాయం చేకూరేవరకు పోరాడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్,శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా,దేవదానం, మణి,జిల్లా అధికార ప్రతినిధి శ్రీను గౌడ్,జిల్లా కార్యదర్శులు ఇళయరాజా,గోపి,మాణిక్యం, విభాగ జిల్లా అధ్యక్షులు హరికృష్ణ,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధ్యక్షులు రత్నం,మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఫయాజ్,శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ,మండల అధ్యక్షులు తిరుమలై,షణ్ముగం,రఘునాథం,భాస్కర్, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు సునీల్ రెడ్డి,చందు, నాగరాజు, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, ఆరుల్, ఆల్విన్,ధనశేఖర్,అంబేద్కర్,జిల్లా నాయకులు,నియోజకవర్గ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్రుడితో జగన్ ఆత్మీయ పలకరింపు!

### ఆప్యాయంగా పలకరించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ సత్యవేడు రాజకీయ పరిణామాలపై ఆరా



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్రుడు మంగళవారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "ఏం మహీ.. బాగున్నావా?" అంటూ జగన్ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతోపాటు సత్యవేడు నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పరిస్థితిపై ఆరా తీశారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి, చేపడుతున్న కార్యక్రమాల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. సత్యవేడు రాజకీయ పరిస్థితులపై చర్చించడంతోపాటు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆప్యాయంగా పలకరించడం ఈ భేటీకి ప్రత్యేకతగా నిలిచింది.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

- 44 సీసీ కెమెరాలతో పట్టణంలోని కీలక ప్రాంతాలపై నిరంతరం నిఘా - ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్







ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్--ప్రైవేట్ భాగస్వామ్యంతో పట్టణంలోని ముఖ్య ప్రాంతాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్, ఆసుపత్రులు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పులివెందుల సబ్‌డివిజన్‌లో పబ్లిక్--ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన రెండో ప్రాజెక్టు ఇదేనని ఎస్పీ తెలిపారు. వేంపల్లి పట్టణంలోని 18 ప్రాంతాల్లో ఇప్పటివరకు 44 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణంలోకి వచ్చే, బయటకు వెళ్లే మార్గాల్లో నంబర్ ప్లేట్ గుర్తింపు సాంకేతికత కలిగిన కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో పట్టణంలోని కీలక ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. బస్టాండ్, కళాశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాకపోకలు, ఇతర కార్యకలాపాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు సీసీ కెమెరాల ద్వారా సమాచారం సేకరించి త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. కమాండ్ కంట్రోల్ ప్రాజెక్టులో భాగంగా డ్రోన్ కెమెరాను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్పీ తెలిపారు. వేంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే బహిరంగ సభలు, ఇతర సమావేశాల సమయంలో డ్రోన్, సీసీ కెమెరాలను సమర్థంగా వినియోగించి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు ఈ నిఘా వ్యవస్థ మరింత దోహదపడుతుందని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు పులివెందుల సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి బి.మురళి ఆధ్వర్యంలో కృషి చేసిన సీఐ టి.నరసింహులును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సుధాకర్, పులివెందుల సీఐ శ్రీరామ్, రూరల్ సీఐ శాంతిలాల్, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌రావు, ఎస్సై తిరుపాల్ నాయక్, ఆర్కే వ్యాలీ ఎస్సై శ్రీప్రియ, వేముల ఎస్సై ప్రవీణ్‌కుమార్, చక్రాయపేట ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

ప్రజాభూమి, సిద్ధవటం: ప్రభుత్వ రెవెన్యూ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని పెద్దపల్లి గ్రామం బుగ్గిడి వారి పల్లె పరిధిలోని నిర్మలగిరి కాలనీ సర్వే నంబర్ 870/3లో సుమారు 15 సెంట్ల ప్రభుత్వ భూమిని జేసీబీతో చదును చేసి నిర్మాణ పనులు చేపట్టినట్లు సమాచారం అందడంతో మంగళవారం ఆయన స్థలాన్ని పరిశీలించారు.



ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములకు సంబంధించి కొందరు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొంతమంది ఇంటి స్థల ధ్రువీకరణ పత్రాల్లో రెవెన్యూ అధికారుల సంతకాలను సైతం నకిలీగా సృష్టించినట్లు గుర్తించామని తెలిపారు. సర్వే నంబర్ 870/3కు సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించి విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్ జోషి, రాజు, వీఆర్వో రేణుక తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య తప్పనిసరి- పొలం పిలుస్తోంది

## - ఏడీఏ ప్రభాకర్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

రైతులందరూ 11 అంకెలతో కూడిన విశిష్ట ఐడీ సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని పులివెందుల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) ప్రభాకర్ రెడ్డి సూచించారు.



మండలం లోని నందిపల్లి గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందాలంటే ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ట ఐడీ సంఖ్య తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. రైతులందరూ విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో వేరుశనగ పంట పొలాలను సందర్శించి చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయం

## - రాష్ట్ర డైరెక్టర్ కొమరా...



ప్రజాభూమి, ఒంటిమిట్ట: 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీసీలకు ఉన్న 24.15 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని కల్లుగీత కార్మిక ఆర్థిక సంస్థ మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఎన్నికలకు బీసీలకు 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.13 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా బీసీల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. ఈ నిర్ణయంతో బీసీల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం దేశవ్యాప్తంగా సంచలన నిర్ణయమని నరసయ్య అన్నారు. బీసీలు, మహిళల పట్ల కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో నిరూపించుకుందని ప్రశంసించారు. గత 43 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ బీసీల రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పెద్దఎత్తున కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాదక ద్రవ్యాలపై అవగాహన

## - విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన ప్రిన్సిపాల్



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కే. ఉషశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించామని, వాటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. షాజియా బేగం, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఏ. కుమార్‌రాజ, కె. జనార్దన్, మై భారత్ సమన్వయకర్త రాజారెడ్డి, అధ్యాపకులు నాగేంద్ర, మసూద్, పీడీ తేజేంద్ర, వినోద్, శ్రీను, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయాలి

**జిల్లాలో 1,800 కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడి**


**ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్‌కు లేఖ రాసిన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**



ప్రజాభూమి, పులివెందుల

వైఎస్సార్ జిల్లాలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ పరికరాల కొరత, పెండింగ్ కనెక్షన్లపై ఏపీ ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ కు లేఖ రాసినట్లు, అదే అంశంపై ఫోన్లో కూడా మాట్లాడినట్లు ఎంపీ తెలిపారు. రెండేళ్లుగా రైతుల కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కనెక్షన్లకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్లను వెంటనే విడుదల చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రైతులకు వెంటనే కనెక్షన్లు ఇవ్వాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


# చరిత్రలో బీసీలుకు చారిత్రాత్మకమైన రోజు



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డి వారి గురువారెడ్డి వారి కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ఈరోజు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. సారథ్యంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచే విధంగా వర్షాకాలం శాసనసభ సమావేశాల్లో చర్చించి అనంతరం ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటుచేసి బీసీ రిజర్వేషన్లను పెంచే నిర్ణయం తీసుకోవడం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని గురవా రెడ్డి అన్నారు అదేవిధంగా ఈరోజు గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు చేసే విధంగా చట్టం తీసుకురావడం దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నామని గురువారెడ్డి అన్నారు ఆనాడు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం బిసి వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ 34% కి పెంచి కోల్పోయిన 16,8 00 రాజకీయ పదవులు బీసీలకు వచ్చే విధంగా ఏర్పాటు చేసినటువంటి బీసీలకు ఆరాధ్య దైవం అయినటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనే విషయాన్ని ఈ మీడియా సమావేశం ద్వారా తెలియపరుస్తున్నాం గతంలో నందమూరి తారక రామారావు బీసీలకు స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించారు అనే విషయాన్ని తెలియపరుస్తున్నాం గత 19 24 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి బీసీల ఓట్లు వేయించుకొని బీసీలకు పెద్దపీట వేస్తానని చెప్పి మరి ఆనాడు కత్తిపీట వేశారని నిదర్శనమే 10% స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను పోగొట్టి బీసీ వర్గాలకు 16,800 రాజకీయ పదవులను దూరం చేయడం జరిగింది అనే విషయాన్ని ఈ మీడియా సమావేశం ద్వారా ప్రజలందరికీ బీసీ వర్గాలకు తెలియపరుస్తున్నామని గురవారెడ్డి అన్నారు అనాడు ప్రతిపక్షంలో ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు నాయుడు ఈరోజు బీసీ వర్గాలకు రిజర్వేషన్లు పెంచి రాజకీయం ప్రోత్సహించడానికి బీసీ వర్గాల తరపున స్వాగతిస్తున్నామని , సంతోషం వ్యక్తం చేస్తున్నామని గురవారెడ్డి అన్నారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు బీసీ వర్గాల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం ఈ మీడియా సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డి గురువారెడ్డి తో పాటు ఏర్పేడు మండల ఎక్స్ వైస్ ఎంపీపీ మురుగన్ నియోజకవర్గ బీసీ పార్టీ కార్యదర్శి కుమార్ టిఎన్ఎస్ఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల డివిజన్ ఈఈ నాగేంద్ర ప్రసాద్‌కు సన్మానం



ప్రజాభూమి,పులివెందుల

ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు పులివెందుల డివిజన్ కు చెందిన విద్యుత్ అధికారులు ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్నారు. ట్రిపుల్ సీ కంప్లైంట్స్ పరిష్కారంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆగస్టు 15న పులివెందుల డివిజన్ ఈఈ నాగేంద్ర ప్రసాద్ అవార్డు లభించింది. ఈ అవార్డును సిఎండి లోతేటి శివశంకర్ చేతులమీదుగా ఈ ఈ నాగేంద్రప్రసాద్ అందుకున్నారు అలాగే ఏ డి ఈ గురు మోహన్ రెడ్డి, ఏ ఏ ఓ విజయలక్ష్మిలు ఉండు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పులివెందుల డివిజన్ ఈఈ నాగేంద్ర ప్రసాద్, ఏడి ఈ గురు మోహన్ రెడ్డి, ఏ ఏ ఓ విజయలక్ష్మిలను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి డివిజన్‌కు అవార్డు రావడంలో ఆయన కృషిని అభినందించారు.

# సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక వడ్డీ ప్రయోజనాలు

## డిపాజిట్లపై ఆర్థిక భరోసా.. ఏపీజీబీ సువర్ణావకాశం



ప్రజాభూమి పులివెందుల

సీనియర్ సిటిజన్లకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ప్రత్యేక వడ్డీ ప్రయోజనాలను అందిస్తోంది. బ్యాంకులో డిపాజిట్లు చేసే 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారికి ప్రత్యేక వడ్డీ రేటును కల్పిస్తోంది. మూడున్నర సంవత్సరాల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.8 శాతం వడ్డీ అందిస్తున్నట్లు ఏపీజీబీ పులివెందుల బ్రాంచ్ సీనియర్ మేనేజర్ సందీప్ కుమార్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా త్రైమాసిక వడ్డీ పొందే సౌకర్యం కూడా అందుబా టులో ఉందని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే సీనియర్ సిటిజన్లకు ఈ డిపాజిట్ పథకం ఆర్థిక భరోసా కల్పించే అవకాశంగా ఆయన అభివర్ణించారు. 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకులో ఏటీఎం, ఆర్టీజీఎస్, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. అలాగే హౌసింగ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, సోలార్ లోన్, ఆటో లోన్, కార్ లోన్, గోల్డ్ లోన్లు అతి తక్కువ వడ్డీతో అందిస్తున్నామన్నారు. ఈ విషయంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమం కూడా చేపట్టినట్లు సందీప్ కుమార్ రెడ్డి తెలిపారు.

# అభయ ఆంజనేయా.. నీ కరుణ చూపవయ్యా

## -ప్రత్యేక అలంకారంలో స్వామివారి దర్శనం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పార్లపల్లి రోడ్డు సమీపంలోని కోతి సమాధి అభయాంజ నేయ స్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మంగళ వారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధ లింగస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, సింధూర పూజ, అష్టోత్తర శతనామావళి తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులకు, భక్తులకు సంకల్ప పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసన్ రెడ్డి, అర్చకులు సిద్ధ లింగస్వామి మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతి శని, మంగళవారాల్లో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ అర్చకులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# శ్మశాన స్థలంపై సమగ్ర సర్వే నిర్వహించాలి

## 14 ఎకరాల స్థలం 6 ఎకరాలకు తగ్గిందంటున్న గ్రామస్థులు



ప్రజాభూమి, సిద్ధవటం: మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్‌కేఆర్ నగర్‌లో శ్మశాన స్థల ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం మండల సర్వేయర్ స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల కనకదుర్గ కళ్యాణ మండపంలో కలెక్టర్ నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో గ్రామస్థులు శ్మశాన స్థలం ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ పర్యవేక్షణలో ఈ సర్వే చేపట్టారు. పంచాయతీకి కేటాయించిన డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురాకుండా శ్మశాన స్థలంలోనే చెత్తను డంప్ చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో డంపింగ్ యార్డు కూడా ఆక్రమణకు గురైందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో 15 వేలకుపైగా జనాభా ఉన్న నేపథ్యంలో శ్మశాన స్థలంపై సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులను నిర్ధారించి ప్రహరీగోడ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో దాదాపు 14 ఎకరాలు ఉన్న శ్మశాన స్థలం ప్రస్తుతం సుమారు 6 ఎకరాలకు మాత్రమే పరిమితమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, శ్మశాన స్థలాన్ని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తవ్వకాల్లో వెలుగుచూసిన పురాతన రాగి నాణేలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రంలోని పెన్నా నది తీరాన వెలసిన శ్రీ సిద్ధవటేశ్వర శివాలయంలో ధ్వజస్తంభం తొలగింపు, నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు చేపట్టిన తవ్వకాల్లో మంగళవారం మరికొన్ని పురాతన రాగి నాణేలు బయటపడ్డాయి. రెండో రోజు తవ్వకాలు చేపడుతుండగా ఈ నాణేలు లభించాయని శ్రీశైలం దేవస్థానం ఏఈఈ రమేష్ తెలిపారు. లభించిన నాణేలను శ్రీశైలం దేవస్థానం ట్రస్టుకు అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ప్రవీణ్ శర్మ, స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అమరలింగేశ్వరుని ఆలయంలో ఘనంగా మంగళగౌరీ వ్రతం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరీ సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యంగిరి హోమం, పంచామృత అభిషేకం, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో మంగళగౌరీ వ్రతానికి ఉన్న విశిష్టతను పురస్కరించుకుని మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సంప్రదాయబద్ధంగా వ్రతాన్ని ఆచరించారు. కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రార్థించారు. వ్రతం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ (డిసిసి) ఉపాధ్యక్షులుగా దుబ్బా శ్రీకాంత్ నియామకం

ప్రజాభూమి ప్రతినిధి పీలేరు



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు వై ఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణ రెడ్డి,పీలేరు నియోజకవర్గ ఇంచార్జి బాలి రెడ్డి సోమశేఖర్ రెడ్డి దుబ్బా శ్రీకాంత్ ను అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ దుబ్బా శ్రీకాంత్ పార్టీ కోసం అందిస్తున్న సేవలను గుర్తించి అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దుబ్బా శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రతినిధిగా చురుకుగా పనిచేసి, ఆ తరువాత పీలేరు మండల అధ్యక్షులుగా పనిచేసిన అనుభవంతో రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీ బలోపేతానికి,ప్రజా సమస్యలపై పోరాడటానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## రేణిగుంట గంగమ్మ జాతర మహోత్సవంలో పాల్గొన్న రిషితా రెడ్డి


ప్రజా భోగి ప్రతినిధి రేణిగుంట.



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి శ్రీమతి బొజ్జల రిషిత రెడ్డి మంగళవారం రేణిగుంట గంగమ్మఅమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న బొజ్జల రిషిత రెడ్డి కి ఆలయ కమిటీ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, స్థానిక నాయకులు మరియు కమిటీ సభ్యులు బ్యాండ్ మేళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు,నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందించారు. గంగ జాతర వేడుకల్లో కూటమి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మా భాష, జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, దేవల్ల రమణ, కిరణ్, శివయ్య నాయుడు, సిటి సుబ్రహ్మణ్యం, నూరేరేష్మ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబీ సోదాలు -రూ.2.48 లక్షల నగదు స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో కార్యాలయానికి చేరుకుని సోదాలు చేపట్టారు. దీంతో సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లలో కలకలం రేగింది. కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు లెక్కల్లో చూపని రూ.2.48 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు వివరాలకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీదేవిని విచారించారు. నగదుతోపాటు కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ రికార్డులను, సంబంధిత దస్తావేజులను, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఏసీబీ తనిఖీలు కొనసాగుతుండడంతో కార్యాలయానికి వచ్చిన డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనకు గురయ్యారు. దీంతో వీరిని కూడా విచారిస్తున్నట్టు సమాచారం. డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ అవినీతి ఫిర్యాదులు రావడంతో తనిఖీలు జరిపామన్నారు. అన్ అకౌంటెడ్‌గా ఉన్న రూ2.48లక్షలను స్వాధీనం చేసుకున్నామని, సోమవారం జరిగిన 42 రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలిస్తున్నామన్నారు

## ఆత్మహత్య బెదిరింపు వ్యక్తిని సకాలంలో రక్షించిన రేణిగుంట పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 1:15 గంటల సమయంలో 112 అత్యవసర కాల్‌కు సమాచారం అందింది. శివకృష్ణ అనే వ్యక్తి 112కు ఫోన్ చేసి, తన బంధువు సి,హెచ్ రామకృష్ణ తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ఫోన్ ద్వారా తెలిపినట్లు సమాచారం ఇచ్చాడు.వెంటనే స్పందించినరేణిగుంట పోలీసులు , రామకృష్ణ మొబైల్ ఫోన్ లొకేషన్‌ను గుర్తించి, అతను ప్రస్తుతం రేణిగుంటలో ఉన్నట్లు నిర్ధారించారు. సమాచారం మేరకు రేణిగుంట పోలీసులు తక్షణమే స్పందించి, రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద రామకృష్ణను గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అనంతరం రామకృష్ణకు పోలీసులు ధైర్యం చెప్పి, ఆత్మహత్య ఆలోచనలకు దూరంగా ఉండేలా కౌన్సిలింగ్ నిర్వహించి జరిగిన విషయాన్ని అతని కుటుంబ సభ్యులు మరియు బంధువులకు సమాచారం అందించి, అతని భద్రతకు అవసరమైన సూచనలు చేశారు. సకాలంలో 112 కాల్‌కు స్పందించి, మొబైల్ లొకేషన్ ఆధారంగా వ్యక్తిని గుర్తించి అతని ప్రాణాలను కాపాడిన రేణిగుంట పోలీసుల చర్యను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 112కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

## శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి సేవలో దేవసేనమ్మ

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మ వారి ఆలయంలో మంగళవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పోనకా దేవసేనమ్మ పాల్గొన్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు దేవసేనమ్మకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## న్యాయవాద వృత్తి నిరంతర అధ్యయనం - సామాన్యులకు న్యాయం అందించడమే లక్ష్యం కావాలి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




అనంత కాలేజీ ఆఫ్ లా వారి కాలేజీ వార్షికోత్సవ కార్యక్రమంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం చాలామంది ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులను ఎంచుకుంటున్నప్పటికీ, సమాజంలో మంచి అడ్వకేట్‌గా స్థిరపడాలనే లక్ష్యంతో న్యాయ విద్యను ఎంచుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. న్యాయ విద్య కేవలం ఒక కోర్సు కాదని, జీవితాంతం కొనసాగించే అధ్యయనమని పేర్కొన్నారు. చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు ఎప్పటికప్పుడు మారుతుంటాయని, అందువల్ల న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేస్తూ తమ జ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లాలో కోర్టు నిర్మాణాన్ని తుడా ఆధ్వర్యంలో అత్యంత వేగంగా పూర్తి చేసిన విషయాన్ని డా. డాలర్స్ దివాకర్ రెడ్డి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన సందర్భంగా కేవలం 15 రోజుల్లో రాత్రింబవళ్లు శ్రమించి అవసరమైన పనులను పూర్తి చేసి ప్రారంభించామని తెలిపారు. ఈ పనులను అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశంసించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. న్యాయ విద్యార్థులు, యువ అడ్వకేట్లకు తుడా పరంగా, వ్యక్తిగతంగా తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని డా. డాలర్స్ దివాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి న్యాయవాదులుగా ఎదిగి, సామాన్య ప్రజలకు న్యాయం అందుబాటులోకి తీసుకురావాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనంత లా కాలేజ్ స్టూడెంట్స్ మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ముగిసిన శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి కుంభాభిషేక మహోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానంలో మూడు రోజులుగా శిఖర ప్రతిష్ట మహా కుంభాభిషేకం పూజలు ఘనంగా నిర్వహించామని అన్నదానానికి



భారీగా భక్తులు తరలి వచ్చారని ఆలయ పాలకమండలి చైర్మన్ శివకుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి దేవస్థానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆలయ పలక మండలి చైర్మన్ వాటంబేడు శివకుమార్ మాట్లాడుతూ 15 16 17 తేదీలలో శిఖర ప్రతిష్ట మహాకుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించామని నిర్విఘ్నంగా పూజా కార్యక్రమాలు ముగిసాయని అన్నారు దేవస్థానానికి సంబంధించి 11 దుకాణాలు ఉన్నాయని ఆలయంలో మహా కుంభాభిషేక పూజలు జరుగుతుంటే ఒక్క దుకాణదారుడు కూడా ఆలయానికి రాలేదని ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు కమిటీలో కొన్ని తీర్మానాలు చేశామని త్వరలోనే అన్ని దుకాణాలకు నెంబర్లు ఇవ్వడం జరుగుతుందని దుకాణాలపై శ్రీకృష్ణ ధర్మారాజ స్వామి షాపింగ్ కాంప్లెక్స్ ఉండాలని ప్రతిపాదన చేశామని వెల్లడించారు ఒక దుకాణానికి బాడుగ కడుతూ దాన్ని రెండు మూడు దుకాణాలుగా చేసుకొని వ్యాపారాలు నిర్వహించడం కుదరదని పేర్కొన్నారు ఆలయ ఈవో రవికృష్ణ మాట్లాడుతూ మూడు రోజులు పాటు కుంభాభిషేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయని పాలకమండలి కొన్ని తీర్మానాలు చేసి తెలియజేయడం జరిగిందని వీటిని ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు

## ప్రజలు క్షేమంగా ఉండాలి అదే మా లక్ష్యం -ఏర్పేడు ఎస్సై హిమాం

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరిధిలో ఏర్పేడు పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని యువతకు ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు తనిఖీలో భాగంగా వివరించడం జరుగుతుంది. ప్రతిరోజు సాయంత్రం వాహనాలు తనిఖీ చేసే సమయంలో హెల్మెట్ ధరించుకోవాలని ముఖ్యంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతను ఉద్దేశించి పలు సూచనలు సలహాలు ఏర్పేడు పోలీసులు ఇవ్వడం జరిగింది. సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రతిరోజు కూడా వాహన తనిఖీలు జరపడం కొనసాగుతుందని సిఐ శ్రీకాంత్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా ప్రజలకు రాబోయే రోజుల్లో మార్గదర్శకాలుగా నిలవాల్సినటువంటి యువత చెడు మార్గాలు ఎంచుకోకూడదని ప్రతి ఒక్కరికి యువత ఆదర్శంగా నిలవాలని మంచి మార్గాలను ఎంచుకోవాలని ఏర్పేడు ఎస్ఐ హిమాం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వాహనదారులు ఏర్పేడు ఎస్సై హిమాం ఇచ్చిన సలహాలకు సూచనలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత బాధ్యత మా లక్ష్యం అని ఏర్పేడు ఎస్సై హిమాం వారి యొక్క సిబ్బంది తెలిపారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, బి హేన సుజన్. ఆదేశాల మేరకు, తేది :18-08-20 గూడూరు మండలం, గూడూరు నందు అంగన్వాడీ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బేటి బచావో బేటి పడావో, చైల్డ్ హెల్ప్ లైన్స్, ఉమెన్ హెల్ప్ లైన్స్, టోల్ ఫ్రీ నెంబర్స్, గుడ్ టచ్ బాడ్ టచ్ యొక్క అవగాహన కల్పిస్తూ,పోక్సో ఆక్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ గూడూరు సిడిపిఓ షేక్ మెహబూబి, వెంకటాచలం. ఐసిపిఎస్ పిఓఎన్ఐసి సమత చైల్డ్ కౌన్సిలర్ దీ. జోష్ణ , ఓ ఎస్ సి సి ఏ షహనాజ్, శారదా చైల్డ్ లైన్ సిబ్బంది గూడూరు సూపర్వైజర్లు సుజన ,హైమవతి, చెంచులక్ష్మిఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగు పై రైతులకు అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,




గూడూరు మండలం, వెందోడు గ్రామము నందు ఉద్యాన శాఖ ఆధ్వర్యం లో ఆయిల్ పామ్ పంట సాగు , సస్యరక్షణ మరియు యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డా. డి తిరుపాలు, ఉద్యాన శాస్త్రవేత్త - కె.వి.కె పెరియవరం , యన్. సునీత ఉద్యాన అధికారిణి -గూడూరు , బి. గోపి నాయక్ , సహాయ వ్యవసాయ సంచాలకులు - గూడూరు, వి రమేష్ , మండల వ్యవసాయ అధికారి - గూడూరు మరియు 3 యఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ఏ. జి.యం పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమం లో ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యత, ఉద్యాన శాఖ ద్వారా అందించే ప్రోత్సాహకాలు , వేసుకొదగ్గ అంతర పంటలు మరియు పంటల యాజమాన్యం గురించి కూలంకుషంగా రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఎల్నినో ను అధిగమించడం కొరకు ప్రత్యామ్నాయ పద్ధతులు , మరియు నవధాన్యాలు (పి.యం.డి.యస్) విత్తనాల యొక్క విశిష్టతను వ్యవసాయ అధికారులు రైతులకు సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యన్.శంకరయ్య మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మొలగమూడిలో ఇంటింటా పరిశుభ్రతపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ జి.కామరాజు తమ ఆరోగ్య సిబ్బందితో కలిసి అత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మొలగమూడి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిశుభ్రత మరియు దోమల వృద్ధిని దోమల వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ కామరాజు తన సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఇళ్ల చుట్టూ, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కొబ్బరి చిప్పలు,పాతటైర్లు, ప్లాస్టిక్ వస్తువులు,పనికి రాని డబ్బాలు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నీటి నిల్వలే దోమల వృద్ధికి ప్రధాన కారణమని,నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలు ఎలా అభివృద్ధి చెందుతాయో ప్రజలకు ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ,మలేరియా,చికున్ గున్యా,మెదడు వాపు, బోదకాలు వంటి వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు అలాగే ప్రతి శుక్రవారం "ఫ్రైడే -- డ్రై డే"లిగా పాటించి ఇళ్లలోని నీటి నిల్వలను పరిశీలించి, నిల్వ నీటిని తొలగించడం లేదా నీటి పాత్రలను శుభ్రంగా ఉంచడం ద్వారా దోమల ఉత్పత్తి కేంద్రాలను నిర్మూలించాలని ప్రజలకు సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి,ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతోనే దోమల వ్యాధులను సమర్థవంతంగా అరికట్టగలమని హెల్త్ సూపర్వైజర్ కామరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొని గ్రామ ప్రజలకు పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సుకన్య, ఆశాకార్యకర్తలు మునికుమారి, పార్వతి, అంగన్వాడీ టీచర్ విజయమ్మ పాల్గొన్నారు.

## శ్రీసిటీలో హల్ చల్ చేస్తున్న దొంగల ముఠాకు చెక్ పెట్టిన శ్రీ సిటీ పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ సిటీ




ఈ నెల 17 వ తేదీ ఉదయం 2 గంటల సమయంలో శ్రీసిటీ కోల్మన్ కంపెనీ ప్రాంగణంలో చోటుచేసుకున్న చోరీ యత్నాన్ని శ్రీసిటీ గస్తీ బృందం స్థానిక పోలీసుల సహకారంతో భగ్నం చేసింది. శ్రీసిటీ డీఎస్పీ బివి శ్రీనివాసులు సమాచారం మేరకు.. గస్తీలో ఉన్న శ్రీసిటీ భద్రతా సిబ్బంది కోల్మన్ కంపెనీ వద్ద అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే స్పందించారు. శ్రీసిటీ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రియాంక సహకారంతో చోరీ యత్నాన్ని విఫలం చేసి, దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. తమ స్విఫ్ట్ డిజైర్ కారులో అక్కడి నుంచి పరారైన వారిని పోలీసులు మరియు శ్రీసిటీ గస్తీ సిబ్బంది వెంబడించారు. కడూరు క్రాస్ సమీపంలో కారు వదలి దుండగులు పరారయ్యారు. కారును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు. అప్రమత్తతో చోరీ యత్నాన్ని విఫలం చేసి నందుకు శ్రీసిటీ గస్తీ మరియు పోలీస్ బృందాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. శ్రీసిటీలో పరిశ్రమలు, ఉద్యోగులు, ఆస్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తమ భద్రతా బృందాలు పోలీసు శాఖ సమన్వయంతో నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ, భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నామని శ్రీసిటీ సెక్యూరిటీ అధికారి వై.రమేష్ చెప్పారు.

## ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా-సెల్వమణి దంపతులు

ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు



పుత్తూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా బజారు వీధిలోని వినాయక ఆలయం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆర్.కే. రోజా--సెల్వమణి దంపతులు పట్టు వస్త్రాలను స్వామి, అమ్మవార్లకు సమర్పించి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి దంపతులకు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామి, అమ్మవార్ల ఆశీస్సులతో పుత్తూరు ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పురాతన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా కొనసాగుతున్న ఈ బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## జల భద్రత పై జాతీయ వర్క్‌షాప్

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

స్థానిక జల భద్రత, సహజ వనరుల సుస్థిర నిర్వహణ ఎదురవుతున్న సవాళ్లు, వినూత్న పరిష్కారాలు మరియు భవిష్యత్ వ్యూహాల పై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్ షాప్ ను రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం, మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. "జల భద్రత- సహజ వనరుల సుస్థిర నిర్వహణ" అనే అంశం పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ మంగళవారం తో ముగిసింది.ఈ వర్క్ షాప్ ముగింపు కార్యక్రమంలో కీనోట్ స్పీకర్ మరియు రిసోర్స్ పర్సన్ గా ఇందిరా గాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి డా. ఎస్. సిద్ధి రాజు మాట్లాడుతూ స్థానిక జల వనరుల భద్రతతో పాటు సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందు బాటులో ఉండేలా సుస్థిరంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ వర్క్షాప??ను ఘనంగా నిర్వహించినందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భూపతి నాయుడు శుభాకాంక్షలు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యం. నిరంజన్ బాబు మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణ మరియు సుస్థిర అభివృద్ధి కోసం సమాజంలోని అన్ని వర్గాలు భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్షయ్యి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, బోధవ సిబ్బంది, విద్యార్ధిని విద్యార్థుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు బహుమతులను అందచేసారు.



ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
బుధవారం 19 ఆగష్టు 2026

# రిపోర్టర్ శ్రీకాంత్,పై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసును రద్దు చేయాలి

## సత్యవేడులో కదం తొక్కిన జర్నలిస్టు సంఘం నాయకులు.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడులో స్టార్ నైన్ రిపోర్టర్, బిజెపి నాయకుడు శ్రీకాంత్ పై నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును రద్దు చేయాలని పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్యవేడు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్యవేడులో జర్నలిస్టు సంఘం నాయకులు కదం తొక్కి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మా గాంధీ స్మారక స్థూపం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్ఐ సాయినాథ్ చౌదరికి



వినతి అందించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని రెవెన్యూ డిటి వెంకటేశ్వర్లుకు దీనిపై వినతి పత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించే పత్రికా విలేకరులపై ఎలాంటి విచారణ లేకుండా ఏకపక్షంగా కేసులు నమోదు చేయడం సరి కాదన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ మునిశేఖర్ తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి చేసిన తప్పుడు ఆరోపణలను ఆధారంగా తీసుకుని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మూల స్తంభమైన జర్నలిస్టులను అక్రమ కేసులతో వేధించడం తగదన్నారు. శ్రీకాంత్ పై నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును పునః పరిశీలించి శ్రీకాంత్ కు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదులో ఫిర్యాదు అంశాలే గాక వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు, వరదయ్యపాలెం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామచంద్రయ్య, సామర్లహరి, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు,డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, విలేకరులు సలీం భాష,విజయ్ రెడ్డి,శ్రీనివాసులు, కుమార్, రాహుల్, నాగార్జున, శరవణ, రాజ,సోము రెడ్డి,ఖాదర్ భాష, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజాసేవతోనే ప్రజాక్షేత్రంలో గుర్తింపు

## మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రతిమ

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

నిరంతరం ప్రజాసేవతోనే ప్రజా ప్రతినిధులకు ప్రజాక్షేత్రంలో గుర్తింపు ఉంటుందని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీపీ ప్రతిమ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఈ ఐదేళ్ల పదవి కాలంలో మండల అభివృద్ధి కోసం కృషి చేసామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు,మురుగు కాలువల నిర్మాణాలు,తాగునీటి వసతి వంటి మౌలిక వసతుల కోసం మండల పరిషత్ నిధులను వెచ్చించామన్నారు. ముఖ్యంగా మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తుతున్న సమస్యలను పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తదనగుణంగా అధికారులు కూడా సమస్యలను పరిష్కరించడంలో చొరవ



చూపడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండల మీట్లో స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకొస్తున్న అనేక సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరగాలన్నారు. మండల అధికారులు కూడా ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను పారదర్శకంగా సభ్యులకు వివరించడంతోపాటు వాస్తవ పరిస్థితులను తెలియజేయాల్సిన అవసరం ఉంది అన్నారు. తదనంతరం వివిధ సమస్యలపై శాఖల వారిగా చర్చ జరిగింది. కొల్లడం గ్రామంలో ఎయిడెడ్ పాఠశాల మూతపడడంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఈఓ రవి సభ దృష్టికి తెచ్చారు. కన్నవరంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల హైస్కూల్ గా అప్ గ్రేడ్ కావడంతో స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు. భూసార పరీక్షల నిమిత్తం 585 మంది రైతులు సంబంధించిన శాంపిల్స్ పంపినట్టు వ్యవసాయ ఏవో మురళి పేర్కొన్నారు. సబ్సిడీ ధరలపై పిల్లి పెసర పంపిణీ చేస్తున్నామన్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తునున్న దృశ్య ఆరుతడి పంటలను రైతులు సాగు చేసుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. తెల్ల ఆవుల్లో వ్యాపించిన ముద్ద చర్మ వ్యాధికి సంబంధించి టీకాలు వేస్తున్నట్టు వెటర్నరీ డాక్టర్ దయాకర్ తెలిపారు. పది నుంచి 50 సెంట్లు భూమి వరకు రైతులు గడ్డి పెంచుకుంటే ప్రభుత్వం 32 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో త్రివిక్రమరావు,ఆర్డబ్ల్యూఎస్ డిఈ శైలజ, ఆర్టీసీ డిఎం వెంకటరమణ,పిఆర్ ఏఈ ఇబ్రహీం ఖాన్, ఉపాధి ఏపీవో విజయభాస్కర్,వెలుగు ఇంచార్జ్ ఏపీఎం శివకుమార్,పలువురు ఎంపీటీసీలు,పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో సినీఫక్కీలో రూ.1.50 కోట్ల మొబైల్ ఫోన్ల చోరీ కేసు ఛేదన

## ఆరు రోజుల్లోనే అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్.. 195 మొబైల్ ఫోన్లు, 5 యాపిల్ ట్యాబ్‌లు స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనోవిజన్ మొబైల్ షోరూమ్‌లో సినీఫక్కీలో జరిగిన భారీ దొంగతనం కేసును తిరుపతి జిల్లా పోలీసులు కేవలం ఆరు రోజుల్లోనే ఛేదించారు. బంగ్లాదేశ్ సరిహద్దు మీదుగా చోరీ సొత్తును ఇతర దేశాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న అంతర్రాష్ట్ర మొబైల్ చోరీ ముఠాకు చెందిన నలుగురు నిందితులను పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా సమీపంలో అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడిని తిరుపతిలో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.1.50 కోట్ల విలువైన 195 మొబైల్ ఫోన్లు, 5 యాపిల్ ట్యాబ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., దర్యాప్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తిరుపతి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ (క్రైమ్ ఇంచార్జి) ఆర్ల శ్రీనివాసులు, తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ. రామకృష్ణ, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఆగస్టు 8వ తేదీ తెల్లవారుజామున సోనోవిజన్ మొబైల్ షోరూమ్‌లో ఎవరికీ అనుమానం రాకుండా గోడకు రంధ్రం వేసి గుర్తుతెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి అత్యంత ఖరీదైన మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న షోరూమ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా క్రైమ్ పోలీసులు, క్లూస్ టీమ్, సైబర్ క్రైమ్, కమాండ్ కంట్రోల్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో పాటు వివిధ కోణాల్లో




దర్యాప్తు చేపట్టి, ఇదే తరహాలో పెద్ద మొబైల్ షోరూమ్‌లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న ముఠాలకు జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలను జార్ఖండ్, నాగ్‌పూర్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలకు తరలించారు. ఇతర రాష్ట్రాల పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తును వేగవంతం చేశారు. లభించిన ఖచ్చితమైన సమాచారంతో నిందితులు చోరీ సొత్తుతో కలిసి బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలోని మాల్దా వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా సమీపంలో దర్యాప్తు బృందాలు నేరం జరిగిన ఆరు రోజుల్లోపే ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు ఒక రిసీవర్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నాయి. వారి వద్ద నుంచి సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో చోరీకి గురైన 175 మొబైల్ ఫోన్లు, 5 యాపిల్ ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 14న నిందితులను జాంగిపూర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తిరుపతికి తీసుకువచ్చారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారంతో టొనిక్ షేక్ సోదరుడు అనికుల్ షేక్‌ను తిరుపతి--రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి ఆసుపత్రి సమీపంలో పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మరో 20 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు జార్ఖండ్ రాష్ట్రంలోని సాహెబ్‌గంజ్ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందినవారని, ఒక ముఠాగా ఏర్పడి పెద్ద మొబైల్ షాపులను లక్ష్యంగా చేసుకుని ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నారని వెల్లడైంది. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా పరిసర ప్రాంతాలకు తరలించి, అక్కడి నుంచి బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఆలమ్ షేక్‌పై జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 12 కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఉత్తరప్రదేశ్‌లో అతనిపై గ్యాంగ్‌స్టర్స్ అండ్ యాంటీ సోషల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్ కింద కేసు నమోదై, సుమారు రెండేళ్లు జైలులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠాను అరెస్ట్ చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో పెద్ద మొబైల్ షోరూమ్‌లను లక్ష్యంగా చేసుకుని భవిష్యత్తులో వారు చేపట్టే అవకాశం ఉన్న పలు చోరీలను అడ్డుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ పెద్ద వ్యాపార సంస్థలు, నగల దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, షోరూమ్‌లు, ఇతర దుకాణాల యజమానులు తమ వ్యాపార ప్రాంగణాల్లో ఆధునిక అలారం వ్యవస్థలతో కూడిన మోషన్ డిటెక్షన్ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన చోట ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవడంతో పాటు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కేసును అత్యంత స్వల్ప వ్యవధిలో ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ ఐ. రామకృష్ణ పర్యవేక్షణలో పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు శివకుమార్ రెడ్డి, అబ్బన్న, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, సుబ్బారెడ్డి, చిరంజీవి, సిబ్బంది మోహన్ కుమార్, చంద్రశేఖర్, గౌస్ ఆరిఫ్, మునిరాజు, గోపికృష్ణ, మురళిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. ఈ వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., వెల్లడించారు. ఈ కేసులో ఆలమ్ షేక్ (49), ఎం.డి. బసీరుద్దీన్ షేక్ (66), టొనిక్ షేక్ (32), ఎం.డి. అష్మాల్ హక్ ఏ సోహెల్ (34), అనికుల్ షేక్ (సుమారు 26)లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఎం.డి. అష్మాల్ హక్ ఏ సోహెల్ చోరీ సొత్తును స్వీకరించే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

# అక్రమ గ్రావెల్ దందా పై ఎమ్మెల్యే పాశం కన్నెర్ర

## అక్రమం గా గ్రావెల్ తవ్వేస్తున్నారని తెలిసిన వెంటనే అసెంబ్లీ నుండే అధికారులకు అడ్డుకోవాలని ఆదేశం

## రంగంలోకి గూడూరు తాసిల్దార్.తోకముడిచిన గ్రావెల్ మాఫియ

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రజల మనిషి అంటూ అభినందనలు తెలుపుతున్న స్థానికులు

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

ప్రజా ప్రయోజనాలే ముఖ్యం..ప్రజలకు చేటుచేసేలా.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే ఒప్పుకోను అన్న పాశంలిసునీల్ కుమార్. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అక్రమ గ్రావెల్ పై ఆరా.. అడ్డుకోవాలని అధికారులకు ఆదేశాలు. నెల్లూరు జిల్లా గూడూరు లో ప్రభుత్వ భూమి




15 అడుగుల మేర కిందకు కుంగింది ప్రైవేట్ భూమి 15 అడుగుల మేర పైకి లేచింది..తాళ్ళమ్మ సాక్షిగా తాటి చెట్టంత ఎత్తుకు ప్రైవేటు వెంచర్ అన్న కథనానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్పందించారు..అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడానికి వెళ్లిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సోషల్ మీడియా వేదికగా వచ్చిన గ్రావెల్ మాఫియా వార్త వెలుగులోకి రావడం తో వెంటనే స్పందించి అందుకు సంబంధించిన వివరాలు తెలుసుకుని గూడూరు వీ=రా తో ఫోన్ లో మాట్లాడి వెంటనే అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడ్డుకోవాలని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,దీంతో గూడూరు వీ=రా రంగంలోకి దిగడం తో గ్రావెల్ మాఫియా పరార్ అయ్యారు, భారీ యంత్రాలు,టిప్పర్లు మొత్తం అక్కడనుండి తరలించేశారు...ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రజా సంక్షేమ మే మొదట ప్రాధాన్యం అని,చట్ట విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని గ్రావెల్ మాఫియా కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు....దీంతో పాశం సునీల్ ప్రజా నాయకుడని సమస్య తన దృష్టికి రాగానే అమరావతి లో వున్నా అసెంబ్లీ లో వున్నా వెంటనే స్పందించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నారు...

# ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ వేగవంతం

## - కాటూరు గ్రామపంచాయతీలో పోలింగ్ కేంద్రాల తనిఖీ



ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని కాటూరు గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం ఓటర్ల ధృవీకరణ కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి వెంకటరత్నమ్మ పోలింగ్ కేంద్రాలు నెం. 7, 8లను సందర్శించి ఓటర్ల వివరాల పరిశీలన పనులను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ, అర్హులైన ప్రతి ఓటరు పేరును జాబితాలో చేర్చడం, తప్పుల సవరణ వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్ల ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# అంబేద్కర్ గురుకుల పాఠశాలను కొనసాగించాలి మంత్రిని కోరిన ఎమ్మెల్యే సునీల్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

కోట గురుకుల పాఠశాలను అదే స్థానంలో కొనసాగించాలని లేదా తప్పని సరిగా మార్పు చేయాల్సి వస్తే చిల్లకూరు మండలం వరగలి నందు రాజ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ కి వినతిపత్రం అందిస్తున్న.... డాక్టర్ శ్రీ పాశం సునీల్ కుమార్. శాసన సభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం నిరుపేదల విద్యార్థుల కొరకు ఐఐటి, నీట్ కోచింగ్ ల కోసం రాష్ట్రంలో 3 ఎక్సలెన్స్ కాలేజ్ లు ఏర్పాటులో భాగంగా కోట మండలం నందున్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఎంపిక చేశారూ. నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని, ఈ కాలేజ్ ఏర్పాటు చేస్తున్నారని తెలియడంతో పిల్లలు, తల్లి తండ్రులు అందరూ వచ్చి ఇతర ప్రాంతాలకు పోవాలి అంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని వారి సమస్యలను తల్లి తండ్రులు వచ్చి తెలిపారని. అందులో ఇది.నియోజకవర్గం కావున చాలా మంది నిరుపేద పిల్లలు ఇక్కడ చదువుతున్నారని అన్నారు. ఈ కాలేజ్ నందు దాదాపుగా 600 మంది పిల్లలు ఉన్నారని, వారంతా బయట స్కూల్ కు పంపాలంటే పిల్లల తల్లి తండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నీట్, ఐఐటి కోచింగ్ లు అందించే కార్యక్రమంలో భాగంగా ఇక్కడ ఎక్సలెన్స్ కాలేజ్ ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో పిల్లలు, తల్లి తండ్రుల కోరిక మేరకు వీలైతే ఇక్కడే ఎస్సీ గురుకుల పాఠశాలను ఉంచాలని లేదంటే చిల్లకూరు మండలం వరగలి నందు కాలేజ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించానని. మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ - సి.సి - పి.యు - ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి (నాయుడుపేట.)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభాగం సహకారంతో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ - సి.సి - పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును దొరవారిసత్రం లోని "యం.జె.పి.బి.సి.డబ్ల్యు జూనియర్ కాలేజ్" నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ అయిన కె. బాలాజి మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏ.ఆర్.టి మందులు, ఎ.పి.శాక్స్ యాప్, క్యు.ఆర్ కోడ్, సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ యం. తిరుపతయ్య, వైస్ ప్రిన్సిపాల్ యం. సుజీవనరావు, లెక్చరర్ పి. కస్తూరి బాబు, ఓ.ఆర్.డబ్ల్యూ లు కె. విజయశ్రీ, ఆర్. భువనేశ్వరి, ఎ.యన్.యమ్ జి.శ్రీలత, పి.ఇ లు మరియు 90 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. తదుపరి క్రిష్ణాపురం ఏరియా లో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కలిగించడం కోసం ర్యాలీ మరియు మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ లో 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 18 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి. శ్రీలత ద్వారా హెచ్ఐవి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

# పదోవ మైలు మలుపువద్ద ఘోర రోడ్డు ప్రమాదం - ఇద్దరు మృతి

ప్రజా భూమి ప్రతినిధి:- బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని శ్రీకాళహస్తి--తడ ప్రధాన రహదారిపై పదోవ మైలు సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జె.జె. ట్రావెల్స్‌కు చెందిన ఎల్.జి. కంపెనీ ఉద్యోగుల రవాణా కోసం వినియోగిస్తున్న టెంపో ట్రావెలర్ (ఏపీ 39 యూఏ 2333) శ్రీకాళహస్తి నుండి శ్రీ సిటీ వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్ (ఏపీ 03 సీఎస్ 0038)ను 10వ మైలు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న డి. గురవారెడ్డి (45), సుబ్బయ్యగుంట గ్రామానికి చెందినవారు, అలాగే వెనుక కూర్చున్న గోపాల్ రెడ్డి (60), బూడిదమడుగు గ్రామానికి చెందినవారు తీవ్రంగా గాయపడ్డారు. గాయాల తీవ్రత కారణంగా గోపాల్ రెడ్డి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, గురవారెడ్డిని చికిత్స కోసం



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, ఇద్దరూ బూడిదమడుగు గ్రామం నుండి రేణిగుంట మండలం సుబ్బయ్యగుంట గ్రామంలో జరుగుతున్న అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరి వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న బి. ఎన్ కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఎన్‌పీటీఈఎల్ కోర్సుల్లో ఆర్జీయూకేటీ విద్యార్థుల సత్తా

## ఎనిమిది పతకాలు కైవసం - నూజివీడు నుంచి ఏడు, ఆర్కేవీ నుంచి ఒకటి

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్.పి.టి. ఈ.ఎల్) నిర్వహించిన నాలుగు వారాల "ఇంట్రడక్షన్ టు క్వాంటం కంప్యూటింగ్ - క్వాంటం అల్గోరిథమ్స్ అండ్ కిస్కిట్" కోర్సులో ఆర్జీయూకేటీ విద్యార్థులు, అధ్యాపకులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 8 పతకాలు సాధించారు. ఇందులో ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 7 పతకాలు సాధించగా, ఆర్జీయూకేటీ ఆర్‌కే వ్యాలీకి చెందిన ఒకరు ఒక పతకం సాధించారు. ఎన్.పి.టి.ఈ.ఎల్‌లో దేశవ్యాప్తంగా 1,04,565 మంది నమోదు చేసుకోగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 1,04,220 మంది నమోదయ్యారు. పరీక్షకు ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 19,000 మంది, దేశవ్యాప్తంగా సుమారు 11,000 మంది హాజరయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 2,839 మంది, దేశవ్యాప్తంగా 2,700 మంది అర్హత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ కోర్సులో మొత్తం 4 గోల్డ్, 14 సిల్వర్



పతకాలు సాధించగా, ఆర్జీయూకేటీ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ మొత్తం 8 పతకాలు దక్కించుకోవడం విశేషం. ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ నకు చెందిన తాడిశెట్టి సౌమ్య బంగారు పతకం సాధించగా, అధ్యాపకురాలు డా. ఉదత పావనితో పాటు దొడ్డిపట్ల మహేశ్వరి, గూడె హేమ వెంకట మారుతి కుమార్, ఎర్ర ఆకాశ్, పులి శ్యామ్ వెంకట దత్తు బాబు, కొవ్వూరి లక్ష్మి అనే విద్యార్థినీ విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించారు. వీరితో పాటు ఆర్జీయూకేటీ ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌కు చెందిన చిలమకూరు వి. సత్య మహేంద్ర అనే విద్యార్థి కూడా సిల్వర్ మెడల్ సాధించారు. ఇప్పటికే ఆర్జీయూకేటీకి చెందిన నలుగురు ఈ రంగంలో పనిచేస్తుండటం విశేషం. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి, ఐ.బి.ఎం, ఐఐటీ మద్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కోర్సు ఐబీఎం రీసెర్చ్, ఐఐటీ, మద్రాస్ మార్గదర్శకత్వంలో కొనసాగింది. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ అల్గారిథమ్స్, కిస్కిట్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు ఈ కోర్సు ద్వారా ప్రత్యేక శిక్షణ లభించింది. ఆగస్టు 17న అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పతక విజేతలు తమ పతకాలను గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.

ఈ సందర్భం గా పతక విజేతలను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ మరియు ఆర్జీయూకేటీ ఛాన్సలర్ ఆచార్య మధు మూర్తి, ఆర్జీయూకేటీ ఉపకులపతి, ఆర్జీయూకేటీ నూజివీడు డైరెక్టర్ (ఇన్‌చార్జి) ఆచార్య ఎం.ఎల్.ఎన్. రావు, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ సాంద్ర, నూజివీడు క్యాంపస్ పరిపాలనా విభాగం అభినందించారు. క్వాంటమ్ టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సాధించేలా ఆర్జీయూకేటీలో అందిస్తున్న ప్రోత్సాహం, శిక్షణకు ఈ విజయం నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు ఆర్జీయూకేటీ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేస్తున్నాయని అభినందించారు.

# అరాచకాలను ప్రోత్సహించడంలో జగన్‌కు, జగ్గిరెడ్డికి తేడా లేదు

- ఆలమూరు ఘటనను రాజకీయం చేయడం సరికాదు
- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

రాష్ట్రంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ముసుగులో అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని, అదే విధంగా కొత్తపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు చిర్ల జగ్గిరెడ్డి అరాచక శక్తులకు అండగా నిలుస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి ఆరోపించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ జగన్‌కు, జగ్గిరెడ్డికి అరాచకాలను ప్రోత్సహించే విషయంలో ఎలాంటి తేడా లేదని విమర్శించారు. ఆలమూరు మండల వైసీపీ అధ్యక్షుడు ప్రభుత్వ అధికారుల విధి నిర్వహణకు అడ్డుపడి, వారిని అసభ్య పదజాలంతో దూషించిన కేసులో అరెస్టై జైలుకు వెళ్లిన ఘటనను జగ్గిరెడ్డి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని బాబ్జి అన్నారు. సంబంధిత కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కాగా, వంతెనల పేర్లకు సంబంధించిన వివాదం, కక్ష సాధింపు కారణంగానే కేసు పెట్టారని చెప్పడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

**మాతృత్వాన్ని అవమానించే వ్యాఖ్యలు సరికాదు**

మహిళలు, తల్లుల గౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ముత్యాల బాబ్జి అన్నారు. "ఎవరికో పుట్టిన పిల్లలకు తమ



పేర్లు పెట్టడమేమిటి" అంటూ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు మాతృత్వాన్ని అవమానించేలా ఉన్నాయని, జగ్గిరెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ఎవరైనా చేతుల్లోకి తీసుకున్నా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటోందని బాబ్జి తెలిపారు. రావులపాలెంలో అయినా, నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లో అయినా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. ఆలమూరు మండలం చెముడులంకలో జరిగిన ఘటనలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడి వ్యవహారశైలిని సమీక్షించి పార్టీ పరంగా చర్యలు తీసుకోవాల్సిన జగ్గిరెడ్డి, ఆ పని చేయకుండా తెలుగుదేశం పార్టీపై ఎదురుదాడికి దిగడం సరికాదని విమర్శించారు. వైసీపీ నాయకులు ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు, చట్టపరమైన సంస్థల పట్ల వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని ముత్యాల బాబ్జి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవిస్తూ, చట్టాన్ని గౌరవించి వ్యవహరించాలని ఆయన సూచించారు.

## వైకాపా రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీగా పప్పుప్పల నాని



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన పప్పుప్పల నానిని వైకాపా రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీగా నియమించిన సందర్భంగా ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, యువత ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నానిని అభినందించారు. ఈ సందర్భంగా పప్పుప్పల నాని మాట్లాడుతూ వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే యువతకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. నాని నియామకం పట్ల గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, యువత హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు, నాని అభిమానులు పాల్గొన్నారు.

## 80 మందికి పైగా ఆర్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు




ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

వాతావరణంలో మార్పులతో గ్రామీణ ప్రాంతం ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించలేదు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఆర్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ధర్మవరం గ్రామంలో శ్రీ ఆర్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిభిరం ఏర్పాటు చేసారు. సుమారు 80 మందికి పైగా రోగులకు ఉచిత రక్త పరీక్షలు ఈసీజీ చేసి మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తీగల శ్రీను, కుందుల మోహన్ సురేంద్ర, మేనేజర్ చింటూ మరియు మణికంఠ, పి. ఆర్. ఓస్. సాగర్, వెంకట్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజేతలో నేతాజీ వర్ధంతి



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటం లో తనదైన ముద్రను వేశారని, అజాద్ హింద్ పౌజ్ స్థాపించడం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో స్వాతంత్ర కాంక్షను రగిలించరాని అయన త్యాగం మరువరానిదని శ్రీ విజేత హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ తెలిపారు. మంగళవారం నేతాజీ వర్ధంతి పురస్కరించుకొని అయన చిత్ర పటానికి విద్యార్థులు పూల మాలలు వేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటం లా బోస్ నిలిచారని విద్యార్థులకు తెలుపుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్ర గ్రంధాలను పరిచయం చేశారు. కార్యక్రమం లో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా కొత్తపల్లి ఆశిష్ లాల్ జన్మదిన వేడుక



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి ఆశిష్ లాల్ జన్మదిన వేడుకలను కొవ్వూరులోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ సమక్షంలో కేక్ కట్ చేసి ఆశిష్ లాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు తాళ్లపూడి మండలం నుంచి తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువత తరలివెళ్లి ఆశిష్ లాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నామా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆశిష్ లాల్ యువతకు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజాసేవలో ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, విజయాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆశిష్ లాల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కోనసీమ కొబ్బరి రైతులను ఆదుకోవాలి

**కొబ్బరి ఉప ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటు చేయాలి**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.




కోనసీమ కొబ్బరి రైతులను ఆదుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శాసన సభ వేదికగా గళమెత్తారు. కోనసీమలో కొబ్బరి తోటల ప్రాధాన్యత రాష్ట్రమంతా తెలుసన్నారు. సరైన ఆదాయం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొబ్బరి తోటల పునరు జ్జీవనానికి సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రివర్యులు తెలిపారని, రైతులను పూర్తిగా ఆదుకుంటే కానీ వారు నిలదొక్కుకునే పరిస్థితి లేదన్నారు. కోనసీమను ప్రత్యేక దృష్టితో పరిగ ణించి కొబ్బరి ప్రాంతీయ కార్యాలయం కానీ, క్వాయర్ ప్రాంతీయ కార్యాలయం కానీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు, అంతర పంటల సాగు కోసం చేయూతనివ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం కొన్ని పథకాలు తీసుకుని వచ్చిందని, వృద్ధాప్య దశకు వచ్చిన కొబ్బరి చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటడానికి సహకారం అందిస్తున్నట్లు వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు తెలిపారని, దానితోపాటు ప్రత్యేకమైన దృష్టి సారించి కొబ్బరి రైతులను ఆదుకోవాలని సభాముఖంగా కోరారు. కొబ్బరి ఉప ఉత్పత్తులు, అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా కొబ్బరి ఉత్పత్తుల విలువ మరింత పెరిగేలా చూడాలని కోరారు. కొబ్బరి రైతులను ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు.

# నాలుగు దశాబ్దాల కబేలా సమస్యకు శాశ్వత పరిష్కారం

**కబేలా మూసివేతకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు.**

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న (కబేలా) పశువులు వధశాల సమస్యకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. దీంతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కబేలా మూసివేతకు, విద్యుత్ సరఫరా నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చోడవరం ప్రాంతంలోని కబేలాల వల్ల ఏళ్ళ తరబడి దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. అయితే రామచంద్రపురం ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఈ సమస్యను ప్రజలు పెద్ద ఎత్తున తీసుకురావడంతో, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి, ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు కబేలా మూసివేత అనుమతులు లభించాయి.

**కబేలా ప్రాంతంలో అధికార యంత్రాంగం విస్తృత చర్యలు**

దీంతో మంగళవారం పోలీసుల బందోబస్తు నడుమ మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కబేలా ప్రాంతానికి చేరుకుని నియంత్రణ చర్యలు చేపట్టారు. జేసీబీల సహాయంతో అక్కడ పేరుకుపోయిన పశు వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. శానిటరీ సిబ్బంది ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

భవిష్యత్తులో తిరిగి పశువధ జరగకుండా కబేలా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో కబేలా కంపు సమస్యకు పూర్తిస్థాయిలో ముగింపు



పలికే దిశగా అడుగులు పడ్డాయి.

**కబేలా నిర్వాహకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి - మంత్రి సుభాష్ హామీ.**

ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా, కబేలా నిర్వహణపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకున్న మంత్రి సుభాష్, కబేలా నిర్వాహకులు చుట్టుగుళ్ల యోషయా, కొత్తూరు చిట్టెమ్మలతో చర్చలు జరిపారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రి సుభాష్ విజయవాడ నుంచి ఫోన్ ద్వారా కబేలా నిర్వాహకుడు చుట్టుగుళ్ల యోషయాతో మాట్లాడి, అదే ప్రాంతంలో డైరీ ఫారం ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అన్ని అనుమతులు, ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే వాసంశెట్టి సత్యం కూడా నిర్వాహకులతో మాట్లాడి వారి జీవనోపాధికి భరోసా కల్పించారు. ఇరువురు మాటలకు సంతృప్తి వ్యక్తం చేసిన యోషయా మాట్లాడుతూ మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఇంతకాలంలో ఎవరూ ఇలా భరోసా ఇవ్వలేదని, మంత్రి సుభాష్ ప్రజాపాలనపై తనకు అపారమైన నమ్మకం ఏర్పడిందని, వారి మాటలు శిరసా వహిస్తూ అంగీకరించి, కబేలా నిర్వహణను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

**కబేలా ప్రాంతాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం**

మంత్రి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో, ఆయన తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



కూటమి నాయకులతో కలిసి కబేలా ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యను మంత్రి సుభాష్ పరిష్కరించడం చారిత్రాత్మక నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా, అనేక మంది రాజకీయ నాయకులు హామీలు ఇచ్చినా సాధ్యం కాని పనిని మంత్రి సుభాష్ చేసి చూపించారని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ద్రాక్షారామం వచ్చే భక్తుల సౌకర్యం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

**ప్రజల ఆనందానికి అవధులు లేవు- మంత్రి సుభాష్‌కు ప్రజలు కృతజ్ఞతలు**

నాలుగు దశాబ్దాలుగా రామచంద్రపురం ప్రజలను పట్టిపీడిస్తున్న కబేలా సమస్యకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పరిష్కారం లభించడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని పని మంత్రి సుభాష్ చేసి చూపించారు" అంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సుభాష్ మరోసారి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డిఎస్పి ఎం. శేషు, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు, మున్సిపల్, పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

జనరల్ 11

బుధవారం 19 ఆగస్టు 2026

## ఎంఈఓ బాలామణికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అభినందనలు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్న తాళ్లపూడి మండల విద్యాశాఖాధికారి బాలామణిని మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలామణి మాట్లాడుతూ తనకు బెస్ట్ సర్వీస్ అవార్డు రావడంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యుల సహకారం కూడా ఉందని అన్నారు. విద్యాశాఖ అధికారులు కోరిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా అందించ డంలో పాఠశాలల యాజమాన్యాలు అందించిన సహకారం అభినందనీయమని తెలిపారు. అందరి సహకారం వల్లే ఈ అవార్డును అందుకోవడం సాధ్యమైందని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ వి.వి. అనీష్, రవీంద్ర భారతి విద్యాలయం కరస్పాడెంట్ నున్న సత్యనారాయణ, సెయింట్ లూక్స్ సుబ్రహ్మణ్యం, సాయి తేజ సుబ్బారావు, శ్రీ విజేత హైస్కూల్ కరస్పాండెంట్ డా. జె.వి. ప్రమోద్ కుమార్, రేడియంట్ శ్రీను, అక్షర సిద్ధి పాఠశాల నుంచి డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జి .ఎల్ .ఎన్. మూర్తి బాధ్యతలు.

-త్వరలో స్పెషల్ డ్రైవ్ ద్వారా సమస్యల పరిష్కారం.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ గా జి.ఎల్.ఎన్ .మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగాబాధ్యతలు స్వీకరించిన మూర్తి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డిపో నుండి ప్రమోషన్ మీద రామచంద్రపురం డిపో మేనేజర్‌గా తొలిసారి బాధ్యతలు స్వీకరించిన ట్లు పేర్కొన్నారు. అలాగే తాను 1987లో ఆర్టీసీలో మొదటి సారిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు డిపోలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కరీంనగర్, సత్తుపల్లి, హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరం, తదితర డిపోల సైతం పలు చోట్ల విధులు నిర్వహించినట్లు మూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత డిపో మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన ఈయన డిపో పరిధిలో ప్రత్యేకించి త్వరలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వివిధ రూట్లులో సమస్యలతో పాటు డిపోలో కార్మికుల సహకారంతో డిపో అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మూర్తి తెలియజేశారు.

## రెండేళ్ల పాలనపై ప్రజల వద్దకు కూటమి శ్రేణులు

-అభివృద్ధి, సంక్షేమంతో ప్రగతి పథంలో రాష్ట్రం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపు మేరకు కొత్తపేట పంచాయతీ పరిధిలోని 136వ బూత్‌లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలకు జవాబుదారీగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం పనుల వేగవంతం, భోగాపురం విమానాశ్రయం ప్రారంభం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రజల సమస్యలు, లోటుపాట్లను కూడా తెలియజేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కంఠం శెట్టి శ్రీనివాసరావు, బీర ఇషాక్, మట్టా బాలు, బూత్ కమిటీ కన్వీనర్లు మండేపూడి శ్రీనివాస్, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి




ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.

మత్తు మాదక ద్రవ్యాలకు యువతదూరంగా ఉండాలని మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే తగిన చర్యలు తప్పవని, ఎటపాక సిఐ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం వడ్డిగూడెం గ్రామంలోని శివాలయం వద్ద మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలు గురించి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత వక్రమార్గాలు గంజాయి సరఫరా సేవించడం వంటి వాటికి దూరంగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైనా గంజాయి సరఫరా చేస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళలు పట్ల వేధింపులు అసభ్యకారంగా మాట్లాడిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పెద్దలు పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐ సూచించారు. రహదారి ప్రయాణంలో అతివేగంగా వెళ్లి ప్రమాదాలు బారిన పడొద్దుఅని హెల్మెంట్ లేకుండా ప్రయాణం చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో స్తానిక ఎస్ఐ షాక్ సాదిక్, గ్రామస్తులు పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా టీడీపీ ప్రచారం.. ప్రజలతో మమేకమైన నేతలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమం లో నూజివీడు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఆగిరిపల్లి గ్రామ తెదేపా అధ్యక్షు డు పామర్తి నరసింహారావు, ఉపాధ్యక్షుడు గునిశెట్టి సత్యనారాయణ, మండల కో-కన్వీనర్ దుప్పుల సీతారామస్వామి, యువ కార్యకర్త ఇళ్ల ఫ్రాన్సిస్ ముదిరాజ్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రామచంద్రపురం పట్టణంలో కవలవారి సావరంలో గడపగడపకు వైఎస్సార్

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



రామచంద్రపురం పట్టణ పరిధిలోని 18వ వార్డ్ కవలవారి సావరంలో నిర్వహించిన గడపగడపకు వైఎస్సార్ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ , రామచంద్రపురం వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ గారు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, స్థానిక అవసరాలను నేరుగా అడిగి తెలుసుకున్న బోస్ , సూర్యప్రకాష్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటామని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపిస్తే వార్డు అభివృద్ధికి మరింత ప్రాధాన్యతనిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సూర్య ప్రకాష్ కోరారు. ప్రజల ఆదరణ, ఆశీస్సులతో రామచంద్రపురం పట్టణ అభివృద్ధి కోసం మరింత బలంగా పనిచేస్తామని ఈసందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల కొరకు 4 మండలాల సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.





మంగళవారం ఎమ్మార్పీఎస్ మండలాల నూతన కమిటీల కొరకు పత్రిక సమావేశం ద్వారా తెలియపరచడానికి యాటపాక, విఆర్ పురం, కూనవరం, చింతూరు, మండలల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ మొర్త బుజ్జి బాబు మాదిగ సారథ్యంలో, ఎమ్మార్పీఎస్ వి ఆర్ పురం మండల అధ్యక్షుడు తుంగ కుమార్ ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు మాదిగ హాజరయ్యారు. ఈ సమావేశంలో చిన్న సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో కొనసాగుతు గత రెండు సంవత్సరాలుగా నూతన కమిటీ ఏర్పాటు చేయకుండా నూతన నాయకత్వన్ని తయారు చేయకుండా, రాష్ట్ర కమిటీ పిలుపును పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్న సీనియర్ నాయకులను, రాష్ట్ర వ్యాప్తంగా ఏ విధంగా అయితే నిర్ణయాలు తీసుకున్నామో అదేవిధంగ ఈ నాలుగు మండలాలలో ఉన్న ఎంఆర్పీస్ సీనియర్ నాయకుల కమిటీ రద్దు చేశారు. వారికీ మరలా ఉద్యమంలో పని చేసే ఉద్దేశ్యం ఉన్న వారిని ఎం ఎస్ పి (మాదిగ సోషలిస్ట్ పార్టీ ), ఎం జె పి (మాదిగ జనర్నలిస్ట్ ఫోరం ) నందు బాధ్యతలు తీసుకొనే వారిని స్వీకరిస్తాము అన్నారు. ఈరోజు నుండి గడ్డం వెంటకేశ్వర్లు మాదిగ , గడ్డం బాబురావు మాదిగ , వారిని ఎమ్మార్పీఎస్ నాయకత్వం నుండి తొలగించడం జరిగిందనీ అన్నారు. అదేవిధంగా యటపాక మండలం నందిగామా గ్రామం నుండి కొత్తపల్లి నితిన్ ని నియమించడం జరిగిందని, అలాగే ఎంఆర్పీఎస్ అధికార ప్రతినిధిగా మోదుగు ముత్యాలు, కూనవరం మండలం పోచవరం గ్రామం నుండి ఎంఎంఎస్ (మాదిగ మహిళా సమైక్య ) చంద్రూ గొండ వరలక్ష్మిని నియమించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి అల్లూరి సీతారామరాజు మాజీ జిల్లా కన్వీనర్ బింగి విష్ణు మూర్తి మాదిగ, మాజి జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్న బాబు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గడ్డం కృపారావు మాదిగ, మహిళ జిల్లా అధ్యక్షురాలు ములకలపల్లి సరోజినీ, జిల్లా మహిళా కార్యదర్శి సందీపాము ఉషారాణి, ముయ్యేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## బండి పేరమ్మకు సీఎం సహాయ నిధి భరోసా




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామానికి చెందిన బండి పేరమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 1,25,373 విలువైన ఎల్ఓసీ చెక్కును రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. తన వైద్య అవసరాలకు ఆర్థిక సహాయం అందించిన మంత్రి కొలుసు పార్థసారథికి బండి పేరమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్తపల్లి వెళ్ళడం... మాకు ఇష్టం లేదు

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.



వడ్డిగూడెం పోలవరం నిర్వాసిత కుటుంబాలకు కొత్తపల్లి వెళ్ళడం మాకు ఇష్టం లేదని, గ్రామస్తులకు పునరావాసంలో స్థల నిర్ణయం కోసం కొత్తపల్లి వెళ్లడం తమ జీవితాలను అతోగతి పాలు చేస్తుందని, మంగళవారం వడ్డిగూడెం నిర్వాసిత ప్రజలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాసిత ప్రజలు మాట్లాడుతూ మా బంధు వర్గాలు చుట్టుపక్కల గ్రామ ప్రజలు, మాకు తెలిసిన మా కుటుంబాలతో పరిచయాలు అనుబంధాలు బంధాలతో ఉన్న నిర్వాసితులందరూ తాడువాయి కొయ్యలగూడెం పరిసర ప్రాంతాల్లో ఇళ్ల కేటాయింపులు చేయగా, మమ్మల్ని కొత్తపల్లి పంపించి మమ్మల్ని ఒంటరి వారిని చేయవద్దని, కొత్తపల్లి వెళ్లడం తమకు ఇష్టం లేదని పోలవరం ప్రాజెక్టులు నీటిలో జల సమాధి అవుతాము గాని కొత్తపల్లి మాత్రం వెళ్లమని ఒడ్డుగూడెం గ్రామస్తులు ముక్తకంఠంతో స్థానిక శివాలయంలో ఏర్పాటుచేసిన గ్రామస్తుల సమావేశంలో సంబంధిత అధికారులకు తెలియజేశారు. సర్వం కోల్పోతున్న తమను ఇంకా ఒంటరి వారిని చేయవద్దని, తమకు కూడా వీఆర్పురం గ్రామంతో పాటు తడువాయి గాని, కొయ్యలగూడెం గాని, ఇల్లని నిర్మాణం చేసి ఇవ్వాలని వారు సంబంధిత అధికారులకు వేడుకున్నారు. గతంలో కొందరు తెలిసి తెలియక చేసిన పొరపాటుకు మొత్తం గ్రామాన్ని బలిపెట్టవద్దని, మా యందు దయవుంచి మమ్మల్ని మేము కోరుకున్న చోట పునరావాసం కల్పించాలని, లేనిపక్షంలో తాము ఇక్కడే జల సమాధి అవుతామని వారు అధికారులకు తెలియజేశారు. ఆర్ అండ్ ఆర్ ఇళ్ల పరిహారం.. పూర్తిస్థాయిలో గ్రామస్తులు అందరికీ అందిన తర్వాతే మమ్మల్ని ఇక్కడి నుంచి తరలించాలని అక్కడికి వెళ్ళిన తర్వాత ఇస్తాం మీరు వెళ్లిపోండి అని మిగిలిన వారిని అన్యాయం చేయవద్దని, ఇంకా ఒడ్డుగూడెం గ్రామంలో 15 ఇళ్ళకి పరిహారం రాలేదని, ఆర్ అండ్ ఆర్ రాని వారు సుమారు 60 నుంచి 70 మంది వరకు ఉన్నారని, కనుక వీరందరికీ న్యాయం జరిగిన తర్వాతే గ్రామాన్ని ఖాళీ చేస్తామని వారు ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, తదితరులు గ్రామంలో స్త్రీలు పురుషులు పిల్లలు అందరూ అధికారులకు చేతులెత్తి మొక్కుకున్నారు.

## బీసీ బిడ్డలకు ఐఐటీ - జేఈఈ, నీట్ శిక్షణ

- రాష్ట్ర బీసీ సంక్షేమ సవిత
- రాష్ట్రంలో రూ.6.86 కోట్లతో 2 ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటు
- అమలాపురంలో బాలురు, తిరుపతిలో బాలికల సెంటర్లు
- ఫస్ట్ , సెకండర్ ఇంటర్ లో 160 మంది చొప్పున 320 మందికి శిక్షణ
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఫస్ట్ ఇంటర్ తరగతులు ప్రారంభం
- ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం
- సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి ధన్యవాదాలు

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి



బీసీ విద్యార్థులు ఐఐటీ - జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఒక్కో కేంద్రం ద్వారా 320 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. రూ. 6.86 కోట్లతో ఈ రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ మార్కులతో సత్తాచాటుతున్న బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెండు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఐఐటీ - జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటేలా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ నివాస విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలో ఈ రెండు కేంద్రాలను అమలాపురం, తిరుపతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమలాపురంలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంలో బాలురకు, తిరుపతిలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. త్వరలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 160 మంది విద్యార్థులకు అడ్మిషన్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీసీలో 80 మంది, బైపీసీలో 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఎంజేపీ గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ఎక్స్ లెన్స్ సెంటర్ కు ఎంపిక చేయనున్నామన్నారు. ఈ కేంద్రాల ద్వారా బీసీ విద్యార్థులు ఐఐటీ - జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎయిమ్స్,ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధిక సంఖ్యలో ప్రవేశాలు సాధించేలా అవకాశాలు కల్పించడమే ఈ శిక్షణా కేంద్రాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమ సవిత తెలిపారు. ఈ రెండు కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 6.86 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నామన్నారు. బీసీ బిడ్డల ఉన్నత విద్యకు ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## జెండా మోసిన బీసీ అన్నలకు రాజకీయ అధికారం... కూటమి ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం

- హోంమంత్రి వంగలపూడి అనిత
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల దిశగా కేబినెట్ నిర్ణయం హర్షణీయం
- బీసీలు ఓటు బ్యాంకు కాదు... తెలుగుదేశం పార్టీకి, కూటమి ప్రభుత్వానికి వెన్నెముక: అనిత
- ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న మంత్రివర్గ సమావేశంలో భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా ఉంది

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతలో చారిత్రాత్మక అడుగు అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకోవడంలో తాను కూడా భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని తెలిపారు. "బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు... తెలుగుదేశం పార్టీకి, కూటమికి మొదటి నుంచి వెన్నెముక. పార్టీ కష్టకాలంలోనూ జెండాను వదలకుండా, ఎండనక-వాననక గడపగడపకూ తిరిగి పార్టీని ప్రజల్లో నిలబెట్టిన బీసీ కార్యకర్తలకు రాజకీయంగా సముచిత గౌరవం, అవకాశాలు కల్పించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం" అని పేర్కొన్నారు. "నిన్నటి వరకు పార్టీ కోసం జెండా మోసిన సామాన్య బీసీ కార్యకర్త... రేపు అదే గ్రామంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా ప్రజలకు నాయకత్వం వహించాలి. బీసీలకు అవకాశాలు కల్పించడమే కాదు... వారిని అధికారంలో భాగస్వాములను చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం" అని అనిత తెలిపారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 24.15 శాతం బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల రాజకీయ ఎదుగుదలకు పెద్దపీట వేసిందని, స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు, అవకాశాలు కల్పిస్తే... అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు బీసీలను నాయకత్వ స్థానాల్లో నిలబెడుతున్నారని పేర్కొన్నారు. "బీసీల సంక్షేమం అంటే కేవలం పథకాలు, ఆర్థిక సహాయం మాత్రమే కాదు. రాజకీయంగా నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో వారిని కూర్చోబెట్టడమే నిజమైన సాధికారత. జెండా మోసిన చేతులకే అధికార బాధ్యతలు అప్పగించే ఈ చారిత్రాత్మక నిర్ణయంలో మంత్రివర్గ సహచరురాలిగా భాగస్వామిని కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని హోంమంత్రి అనిత అన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు మంత్రివర్గ సహచరులకు హోంమంత్రి వంగలపూడి అనిత ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజాభూమి

జనరల్

బుధవారం, ఆగష్టు 19, 2026






## స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల పునరుద్ధరణ

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా

రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల (బీసీ) సంక్షేమం, ఆర్థిక పురోగతికి వైకాపా పాలనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి కొల్లు రవీంద్ర అసెంబ్లీ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు లభించిందని మంత్రి గుర్తుచేశారు.

చారిత్రక రిజర్వేషన్లు: 1987లో ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 1995లో చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని వివరించారు.

గత ప్రభుత్వ కుట్ర: 2019-24 మధ్య జగన్ రెడ్డి పాలనలో బీసీలను తీవ్రంగా అణచివేశారని విమర్శించారు. కుట్రపూరితంగా రిజర్వేషన్లను 34 శాతం నుండి 24 శాతానికి కుదించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీ నాయకులు తమ పదవులను కోల్పోయారని మండిపడ్డారు.దాడు లు, ఆత్మహత్యలు: బీసీ నాయకత్వాన్ని దెబ్బతీసేందుకు అక్రమ కేసులు, దాడులకు పాల్పడ్డారని.. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్ వంటి ఎందరో బీసీ నాయకులను దారుణంగా హత్య చేశారని ఆరోపించారు.

ఉపాధి, బిల్లుల బకాయిలు: రూ.2,730 కోట్ల ఉపాధి హామీ బిల్లులను నిలిపివేయడంతో అప్పులు తీర్చలేక దాదాపు 50 మంది బీసీలు ప్రాణాలు తీసుకున్నారని, అలాగే ఇసుక పాలసీని నిలిపివేసి 67 మంది భవన నిర్మాణ కార్మికుల మరణాలకు కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ రక్షణ చట్టం:బీసీ వర్గాలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి, వారి భద్రత కోసం ప్రత్యేకంగా 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నట్లు కొల్లు రవీంద్ర ప్రకటించారు. ఈ దిశగా కూటమి తీసుకున్న పలు కీలక నిర్ణయాలను వివరించారు:

స్థానిక ఎన్నికలు: 34 శాతం రిజర్వేషన్లతోనే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం.

వడ్డెరలకు ప్రాధాన్యం: బిల్డింగ్ మెటీరియల్ క్వారీల్లో వడ్డెర సామాజిక వర్గానికి 33 శాతం రిజర్వేషన్లు.

గీత కార్మికులకు ఊరట: కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు, బార్లలో 10 శాతం రిజర్వేషన్లు.

విద్యుత్ సబ్సిడీలు: నాయీ బ్రాహ్మణులు, చేనేత కార్మికులకు ఉచిత/సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నాం.

బీసీల నిజమైన ఎదుగుదల, ఆర్థిక పురోగతి కేవలం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## మాతృభాష 'తెలుగు'కు విద్యావ్యవస్థలో పూర్వవైభవం రావాలి

### అసెంబ్లీలో గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాష్ట్రంలో మాతృభాష తెలుగును పరిరక్షించడంతో పాటు, విద్యార్థుల్లో భాషాప్రావీణ్యాన్ని పెంచేం దుకు విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ఆయన మాట్లా డుతూ విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను అభినందిస్తూనే, తెలుగు భాషా పరిరక్షణపై తన ఆందోళనను వ్యక్తం చేశారు.ప్రభుత్వ విద్యా సంస్కరణలు అభినందనీయంవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యారంగం సరికొత్త పుంతలు తొక్కుతోందని యార్లగ డ్డ కొనియాడారు.

భారీ నిధులు: తెలుగు భాష అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.మెగా డీఎస్సీ: 16,347 పోస్టుల భర్తీ ద్వారా పాఠశాలలకు కొత్త ఊపిరి ఊదారన్నారు.

సంక్షేమ పథకాలు: 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం', 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర' వంటి పథకాలు విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు.

ఆధునిక బోధన: స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, AI ఆధారిత విద్యా విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెరిగి, ఈ ఏడాది లక్ష మందికి పైగా ప్రైవేట్ విద్యార్థులు సర్కారీ బడుల్లో చేరారని వెల్లడించారు.పదో తరగతిలో 37,000 మంది తెలుగు ఫెయిల్ — తీవ్ర ఆందోళనకరం!

రాష్ట్రంలో విద్యార్థులు తెలుగు మాట్లాడగలుగుతున్నా... చదవడం, రాయడంలో ఘోరంగా వెనుకబడుతున్నారని యార్లగడ్డ వాపో యారు. ఇటీవల వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో తెలుగులో 37,679 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయమన్నారు.

అదే సమయంలో హిందీలో 1,436 మంది, ఇంగ్లీష్‌లో 8,771 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారని... మాతృభాషలోనే ఇన్ని వేలమంది వెనుకబడటం శోచనీయమని పేర్కొన్నారు.కార్పొరేట్ విద్యాసంస్థలు కేవలం మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను ఇతర భాషల వైపు మళ్లిస్తున్నాయని విమర్శించారు.

పరిపరివిధాలా మారాల్సిన బోధనా విధానం: ఎమ్మెల్యే సూచనలువిభాగాలుకావాల్సిన మార్పులుపరీక్షల తీరుగణితం, సైన్స్‌లాగే తెలుగులోనూ 99 మార్కులు సాధించేలా ప్రశ్నపత్రాల విధానం సులభతరం చేయాలి.పాఠ్యాంశాలుకేవలం కఠిన వ్యాకరణం, క్లిష్టమైన పద్యాలకే పరిమితం కాకుండా గిడుగు రామమూర్తి ప్రచారం చేసిన 'వ్యవహారిక భాష'కు పెద్దపీట వేయాలి.

కమిటీ ఏర్పాటువిద్యావేత్తలు, తెలుగు ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీ వేసి తెలుగు బోధనలో మార్పులపై అధ్యయనం చేయించాలి.భవిష్యత్ తరాలకు మన మాతృభాష, సంస్కృతులను సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని యార్లగడ్డ వెంకట్రావు ఈ సందర్భంగా అసెంబ్లీ వేదికగా పిలుపునిచ్చారు.

## ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వండి



**- పీఎండీఎస్ విధానంతో పంటలకు స్థిరత్వం**
**- ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోండి**
**- ప్రకృతి వ్యవసాయం అన్నదాతలకు వరం**
**- పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమిప్రతినిధి, విజయవాడ:

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.ల క్ష్మీశ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేప థ్యంలో ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని తెలిపారు. మైలవరం మండలం, మొరు సుమిల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రస్తుతం సాగుచేస్తున్న పంటలు, ఆ పంటల సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికను వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతుల కు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యత నిస్తూ, అందు బాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. పీఎండీఎస్ పంటల సాగు ద్వారా నేలలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండి పంటల స్థిరత్వం పెరుగుతుందన్నారు. అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగుతో పాటు పశు పోష ణపైనా దృష్టిసారించాలని ఈ సంద ర్భంగా సూచించారు. ప్రకృతి వ్యవసాయం అన్నదాతలకు వరమని.. రసాయ న ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి, రైతులను పెద్దఎత్తున ప్రోత్స హి స్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రభు త్వ ప్రధాన లక్ష్యమని, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతోందని.. వీటిని రైతులు సద్వి నియోగం చేసుకుని, సమర్థవంతమైన పంటల సాగు విధానాలను అవలంబించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పీఎండీఎస్ పంటల క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రైతులతో పాటు జిల్లా వ్యవసాయ అధికారి సీహెచ్ తిరుమలదేవి, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ తప్పనిసరి



**5–7, 15–17 ఏళ్ల వయస్సు పిల్లలకు సెప్టెంబర్ 30 వరకు ఉచితంగా బయోమెట్రిక్ అప్డేషన్**
**ధార్ అప్డేషన్ లేకపోతే భవిష్యత్తులో సేవలు పొందడంలో ఇబ్బందులు**
**జిల్లాలో ఆధార్ సేవలను మరింత చేరువగా, సులభంగా అందించేందుకు చర్యలు...**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

పిల్లల ఆధార్‌లో తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేషన్‌ను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. ఆధార్ బయోమెట్రిక్ వివరాలను నిర్దేశిత వయస్సులో అప్డేట్ చేయకపోతే భవిష్యత్తులో ఆధార్ ఆధారిత సేవలు పొందే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకా శం ఉన్నందున తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.విజయవాడ కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఆధార్ నమోదు, అప్డేషన్ ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేషన్లు, ఆధార్ కేంద్రాల పనితీరు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, పిల్లల వయస్సు పెరుగుతున్న కొద్దీ వారి బయోమెట్రిక్ వివరాలను ఆధార్‌లో అప్డేట్ చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. 5–7 సంవత్సరాలు మరియు 15–17 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేషన్‌ను సెప్టెంబర్ 30, 2026 వరకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లల ఆధార్ బయోమెట్రిక్ వివరాలను నిర్దేశిత గడువులోగా అప్డేట్ చేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేషన్ (MBU – Mandatory Biometric Update) పెండెన్సీపై అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందించారు. 5–7 సంవత్సరాల వయస్సు పిల్లల్లో 31,184 మంది, 15–17 సంవత్సరాల వయస్సు పిల్లల్లో 37,470 మంది బయోమెట్రిక్ అప్డేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మొత్తం 68,654 మంది పిల్లల బయోమెట్రిక్ అప్డేషన్‌ను ప్రత్యేక దృష్టితో పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 206 ఆధార్ ఎన్రోల్మెంట్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

గత నెల రోజుల్లో జిల్లాలో ఆధార్ ఎన్రోల్మెంట్, అప్డేషన్‌కు సంబంధించి 28,821 కార్డుల ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు.ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా, వేగంగా అందేలా కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ జిల్లా కలెక్టరేట్‌లో పర్మనెంట్ ఆధార్ ఎన్రోల్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా పర్మనెంట్ ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఆధార్ నోడల్ అధికారిని ఆదేశించారు. ప్రజలు తమకు సమీపంలోని ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు విద్యాశాఖ, ఐసీడీఎస్, ఇంటర్మీడియట్ విద్యా శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల స్థాయిలో పిల్లలకు, తల్లిదండ్రులకు ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పిల్లలను గుర్తించి, వారి ఆధార్ అప్డేషన్‌ను గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ ఎన్రోల్మెం ట్, అప్డేషన్ సేవలు ప్రజలకు మరింత చేరువగా, సులభంగా అందించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆధార్ అవసరమయ్యే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే వివరాలను సరిచూసుకుని, అవసరమైన అప్డేషన్లను పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి & జిల్లా ఆధార్ నోడల్ అధికారి కె.వై.ఎస్.ఆర్. రవికుమార్, హైదరాబాద్ యూఐడీఏఐ రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఏ.సత్యకళ, వీఎంసీ డిప్యూటీ కమిషనర్ శకుంతల, డీఎస్పీ సత్యనారాయణ, డీఈఓ సత్యకళ, డీఐఓ ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ నాంచారారావు, డీఎంహెచ్ఓ, డ్వామా, పోస్టల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

**జెండా ఊపి ప్రారంభించిన ఆర్ అండ్ బి ఇంజనీర్-ఇన్-చీఫ్ వి.రామచంద్ర**
**మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు**




ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన 'నశా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎమ్ బిఏ),లో భాగంగా రాష్ట్ర రోడ్లు & భవనాల (ఆర్ అండ్ బి) శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఆర్ అండ్ బి ఇంజనీర్-ఇన్-చీఫ్ వి. రామచంద్ర జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ,రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై ప్రజలను చైతన్యపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే అరికట్టకపోతే సమాజానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు.

పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ పరిధిలోని వారికి కూడా అవగాహన కల్పిం చాలని ఈ ర్యాలీని చేపట్టడం జరిగిందన్నారు.

సమాజానికి పెను ముప్పుగా మారిన మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ కె.నవీన్ మాట్లాడుతూ సమాజానికి పెను ముప్పుగా మారిన మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు, డ్రగ్స్‌కు బానిస కాకుండా ఆరోగ్యకరమైన, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో, యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బెంజ్ సర్కిల్ మీదుగా ఆర్ అండ్ బి శాఖ హెచ్ఓడీ భవనం వరకు సాగింది. అవగాహన ర్యాలీలో సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.వి. భాస్కరరావు, ఇఇ రవిశంకర్, డిఇఇ వై.శశిభూషణ్ తో పాటు శాఖకు చెందిన సుమారు 100 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపారు.

## ఏపీ ఎయిమ్స్ యాప్‌తో పారదర్శక సేవలు

**- జిల్లా వ్యాప్తంగా తగినంత ఎరువుల నిల్వలు**
**- ఎరువుల సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ:

రైతులకు ఎరువుల సరఫరాలో పారదర్శకత, సమర్థత పెంపొందించేందుకు ఏపీ ఎయిమ్స్ యాప్ దోహదం చేస్తోందని.. జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన మేరకు నిల్వలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.కలెక్టర్ లక్ష్మీశ మంగళ వారం మైలవరం మండలం, మొరుసుమిల్లిలో పీఏసీఎస్ ఎరువుల సరఫరా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎరువుల కేంద్రంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన సరఫరాకు సంబం ధించి రికార్డులను పరిశీలించారు. ఏపీ ఎయిమ్స్ యాప్‌పై రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా పీఏసీఎస్‌ల వద్ద 2,532 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు ఎరువుల విక్రేతల వద్ద 4,148 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. డీఏపీని చూస్తే పీఏసీఎస్‌ల వద్ద 591 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు ఎరువుల విక్రేతల వద్ద 586 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు వెల్లడించారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 91549 70454 ను సంప్రదించవచ్చని సూచించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తున్నామని.. వ్యవసాయ సీజన్ పూర్తయ్యే వరకు ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

Printed by MOHANEESWARPUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at East Godavari and published at d.no.70-7-28/1A, KRISHNA NAGAR, SBI COLONY PARK RAMANAYYA PETA KAKINADA editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1470.cell:9502116677.